Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

## ఢిల్లీలో భూప్రకంపనలు.. చైనాలో భూకంప కేంద్రం

అర్ధరాత్రి తర్వాత చైనాలో భూకంపం సంభవించింది. చైనాలోని దక్షిణ జిన్‌యాంగ్ ప్రాంతంలో సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.2గా నమోదైంది. భూకంప కేంద్రం 80 కిలో మీటర్ల లోతులో ఉన్నట్టు నేషనల్ సెంటర్ ఆఫ్ సిస్మాలజీ వెల్లడించింది. మొదట తెల్లవారుజామున 2 గంటల 9 నిమిషాలకు భూకంపం సంభవించింది. ఆ తర్వాత 2 గంటల వ్యవధిలోనే 14 సార్లు భూమి కంపించింది. అయితే ఈ భూకంప తీవ్రత మన దేశ రాజధాని ఢిల్లీని కూడా తాకింది. ఢిల్లీ దాని పరిసర ప్రాంతాల్లో బలమైన భూప్రకంపనలు సంభవించాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

సంపుటి : 1 సంచిక : 365 మేడ్చల్ మల్కాజ్‌గిరి 24 జనవరి 2024 బుధవారం పేజీలు : 4



# గెలుసొచ్చేవాళ్ళకే...

## పార్లమెంటు అభ్యర్థుల కోసం ప్రారంభమైన వేట

హైదరాబాద్: రాజధానిలో మళ్లీ రాజకీయ వేడి మొదలైంది. వీలైనన్ని లోక్‌సభ స్థానాలను తమ ఖాతాలో వేసుకోవడానికి ప్రధాన పార్టీలు అప్పుడే దృష్టి సారించాయి. బల మైన అభ్యర్థులను బరిలో దింపడం ద్వా రా అన్ని స్థానాలను కైవశం చేసుకుని తమ సత్తా చాటాలని అధికార కాంగ్రెస్ యోచిస్తోంది. ఇందులో భాగంగా అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తోంది. భారాస ఒక్క స్థానంలో సిట్టింగ్ ఎంపీనే బరిలో దింపాలని నిర్ణయించింది. మిగిలిన స్థానాల్లో ‘బలమైన’ అభ్యర్థులను బరిలో దింపడానికి నేతలతో చర్చలు మొదలుపెట్టింది. ఇప్పటికే లోక్ సభ నియోజకవర్గాల వారీగా సమీ క్షలు మొదలుపెట్టింది. గతంలో కాకుండా ఈసారి ఈ రెండు ప్ర ధాన పార్టీలకు దీటుగా బలమైన అభ్యర్థులను దింపడం ద్వారా ఆ స్థానాలను తమ ఖాతాలో వేసుకోవాలని భాజపా ప్రయత్నాలు చేస్తోంది. కాంగ్రెస్ ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జిలను ప్రకటించింది.

రాజధాని పరిధిలో హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీ స్థానాలొస్తాయి. మార్చిలో ఎన్నికల షెడ్యూల్, ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో 64 స్థానాలను సాధించిన కాంగ్రెస్.. రాజధానిలో మాత్రం అనుకున్న విధంగా సాధించలేకపోయింది. మొత్తం 29 స్థానాల్లో 3 మాత్రమే దక్కించుకుంది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో బలమైన అభ్యర్థుల ను బరిలో దింపడానికి ఇప్పటి నుంచే అన్వేషణ మొదలుపెట్టింది.

**హైదరాబాద్ :** ఇక్కడి నుంచి పోటీకి ఏ నేతలూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి ఫిరోజ్‌ఖాన్‌కుగానీ, మరొకరికిగానీ టిక్కెట్ దక్కే అవకాశం ఉందంటున్నారు. ఎంఐఎం తరఫున మరోసారి సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పోటీ చేస్తున్నారు.

చేవెళ్ల ఇక్కడి నుంచి అనేక మంది నేతలు కాంగ్రెస్ టిక్కెట్ ఆశిస్తున్నా రెండు ప్రధాన పార్టీల్లో బలమైన నేతల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొద్దిరోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భాజపా విషయానికి వస్తే మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డికి టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. భారాస ఇప్పటికే సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని మరోసారి పోటీకి నిలుపుతున్నామని ప్రకటించింది. సికింద్రాబాద్ అంజన్‌కుమార్ యాదవ్, అజారుద్దీన్ తదితర నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో భారాస నుంచి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు సాయికిరణ్ యాదవ్ పోటీ చేశారు. ఈసారి అతనికే ఇస్తారా లేనిపక్షంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌నే బరిలో నిలుపుతారా అన్నది కొద్ది రోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇక భాజపా నుంచి మరోసారి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పోటీకి నిలిపే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇక్కడి నుంచి అభ్యర్థిని బరిలో దింపాలా లేదా అన్నదానిపై ఎంఐఎం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

## అంగ, అర్థబలం కలిగినోళ్ళకే టిక్కెట్లు

**మల్కాజిగిరి :** గత ఎన్నికల్లో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి గెలుపొందగా ఈస్థానాన్ని మళ్లీ నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఆయన ఉన్నారు. ప్రస్తుతం ఈ స్థానం నుంచి పోటీకి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మల్‌రెడ్డి రాంరెడ్డి, మధుయాస్కీ ఆసక్తి చూపిస్తున్నారు.

ఇక భారాస తరఫున ఈ స్థానం నుంచి మాజీ మంత్రి కేటీఆర్ బరిలో దిగాలని ఆ పార్టీ నేతలు గట్టిగా కోరుతున్నారు. అయితే ఈ టిక్కెట్‌ను తనకు ఇవ్వాలని మాజీ మంత్రి మల్లారెడ్డి కోరుతున్నారు. ఇది కొద్దిరోజుల్లోనే తేలనుంది. నేతల ఒత్తిడి తలొగ్గి కేటీఆర్‌ను అభ్యర్థిగా భారాస అధిష్ఠానం నిర్ణయిస్తే కాంగ్రెస్ కూడా ఆర్థికంగా బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపాలని యోచిస్తోంది.

## రథయాత్రలకు బీజేపీ శ్రీకారం.. ఎప్పుడంటే..!

హైదరాబాద్: లోక్ సభ ఎన్నికలపై భారతీయ జనతా పార్టీ దృష్టిసారించింది. దక్షిణాదిలో సీట్లను పెంచుకోవాలని అనుకుంటుంది. కర్ణాటకలో మాత్రమే బీజేపీ బలంగా ఉంది. తెలంగాణ రాష్ట్రంలో లోక్ సభ సీట్లను పెంచుకోవాలని భావిస్తోంది. ప్రజలకు మరింత దగ్గర అయ్యేందుకు రథయాత్రలు చేపట్టబోతుంది. రథయాత్ర చేపట్టే లోక్ సభ నియోజకవర్గాలను ఐదు క్లస్టర్లుగా ఏర్పాటు చేసింది. క్లస్టర్ల వారీగా రథయాత్రతో ముందుకెళ్లనుంది. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు బీజేపీ రథయాత్రలు తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతాయి. జనాల సమస్యలను తెలుసుకునేందుకు రథయాత్ర



ఉపయోగ పడతాయని బీజేపీ హైకమాండ్ భావిస్తోంది. 2019 లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ 4 సీట్లను గెలుచుకుంది. ఈ సారి 10 సీట్లు గెలవాలని టార్గెట్‌గా పెట్టుకుంది. ఆ దిశగా ప్రచారంతో ముందుకెళ్లనుంది. ఇప్పటికే 12 జిల్లాల అధ్యక్షులను బీజేపీ హైకమాండ్ మార్చింది. ఆరు మోర్చాలకు అధ్యక్షులను నియమించింది. తెలంగాణ రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు రథయాత్ర దోహద పడుతుందని భావిస్తోంది. దక్షిణాది రాష్ట్రాలపై ప్రధాని నరేంద్ర మోదీ దృష్టిసారించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని కేరళ నుంచి ప్రారంభిస్తారని తెలుస్తోంది.

# చేవెళ్లపై ‘త్రి’ నేత్రం..!



తాండూరు: లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో చేవెళ్లపై రాజకీయ పార్టీలు సన్నద్ధమౌతున్నాయి. ఇప్పటికే భారాస,భాజపా అగ్రనేతలు సంస్థాగతంగా కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహించారు. అధికార కాంగ్రెస్ పార్టీ కూడా సమావేశాలు నిర్వహించేందుకు సన్నద్ధమౌతోంది. పరిధిలోకి వచ్చేవి. జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి శాసన సభ నియోజక వర్గాలతో పాటు రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం శాసన సభ నియోజక వర్గాలు వస్తాయి. జిల్లాలోని కొడంగల్ నియోజక వర్గం మాత్రం మహబూబ్‌నగర్ లోక్‌సభలోకి వస్తుంది.

**అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ ఇలా..** చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఏడు శాసన సభ నియోజక వర్గాల్లోకెల్లా ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్, భారాస మధ్యనే ‘నువ్వా.. నేనా’ అనే విధంగా పోటీ జరిగింది.

తాండూరు, పరిగి, వికారాబాద్ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే భారాస రెండోస్థానంలో నిలిచింది. చేవెళ్ల, శేరిలింగంపల్లి, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజక వర్గాల్లో విజయం భారాస సొంతమైంది. ఈ ఫలితాలను చూస్తే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్, భాజపా, భారాస మధ్యనే పోటీ ఉండబోతోందని స్పష్టమౌతోంది.

**కాంగ్రెస్‌లో రాని స్పష్టత :** కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి ఎవరనే విషయంలో ఇంకా స్పష్టతలేదు. శాసన సభ ఎన్నికల్లో జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి నియోజక వర్గాల్లో పార్టీ ఘన విజయం సాధించింది. రంగారెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఓటమి పాలయింది. ఈనేపథ్యంలో పోటీకి బలమైన అభ్యర్థిని దింపాలనే యోచనలో ఉంది.

**భాజపా నుంచి ఎవరో..** చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో భాజపా నుంచి పోటీ చేసే అభ్యర్థిగా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. 2014లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో భారాస నుంచి పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డిపై విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల నాటికి ఆయన భారాసను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. భారాస అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ రంజిత్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత కొండా విశ్వేశ్వర రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడారు. ప్రస్తుతం భాజపాలో కొనసాగుతున్నారు.

**ఇప్పటికే ఖరారైన భారాస అభ్యర్థి :** చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో భారాస నుంచి రెండోసారి పోటీ చేసే అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి పేరు ఖరారైంది. డిసెంబరులో నిర్వహించిన భారాస సన్నద్ధత సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు రంజిత్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీపై లక్ష పై చిలుకు మెజార్టీతో విజయం సాధించారు. జరగబోయే ఎన్నికల్లో అదే మెజార్టీని కాపాడుకోవాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గంలోని అన్ని శాసన సభ నియోజక వర్గాల్లో భారాస నేతల మధ్య సయోధ్య ఉన్నా, తాండూరు నియోజక వర్గంలోకి వచ్చే సరికి మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రస్తుత ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మధ్య విభేదాలు ఉన్నాయి.

## వచ్చే నెల నుండి ఆ రెండు

# పథకాలకు శ్రీకారం




## ఫిబ్రవరిలో గృహజ్యోతి, రూ.500 లకే సిలిండర్..!

హైదరాబాద్ : రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో ఆభయ హస్తం దరఖాస్తులు స్వీకరించింది. ఆభయ హస్తం దరఖాస్తు వివరాలను సిస్టంలో ఎంట్రీ చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ప్రజాపాలన సబ్ కమిటీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో పాటు అధికారులు పాల్గొన్నారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులపై చర్చించారు. ఈ దరఖాస్తులకు సంబంధించి డేటా ఎంట్రీ ఎక్కడి వరకు వచ్చింది. ఎప్పుడు పూర్తవుతుందని అధికారులను భట్టి ప్రశ్నించారు. డేటా ఎంట్రీ దాదాపు పూర్తయిందని అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి నాటికి ఏకంగా కోటి దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి చేసినట్లు వివరించారు. మిగిలిన ఐదారు లక్షల అప్లికేషన్ల సమాచారాన్ని శనివారం, ఆదివారంలోపే పూర్తి చేస్తామని చెప్పారు. గ్యారెంటీల వారిగా ఎన్ని అభ్యర్థనలు వచ్చేయో చర్చించారు. ముఖ్యంగా రేషన్ కార్డు, ఇళ్ల కోసం భారీగా దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త ఉండలని భట్టి సూచించారు.

ప్రజా పాలన దరఖాస్తు డేటా సేకరణలో కానీ, ఎంట్రీలో కానీ ఎవరు కూడా దరఖాస్తుదారుని ఓటీపీ అడగలేదని ఆయన స్పష్టం చేశారు. ఓటీపీ అనే అంశం దరఖాస్తులోనే లేదని.. ఎవరైనా సైబర్ నేరస్తులు ఫోన్ చేసి దరఖాస్తుదారులను ఓటీపీ అడిగితే ఇవ్వొద్దని, వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. త్వరలోనే గృహజ్యోతి గ్యారంటీని అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే డిస్కంల నుంచి రాష్ట్రంలో గృహ విద్యుత్ వినియోగం ఏ మేరకు ఉందనే వివరాలు ప్రభుత్వం సేకరిస్తోంది. 200 యూనిట్లలోపు ఇస్తే ప్రభుత్వం నుంచి డిస్కంలకు నెలకు ఎంత మొత్తం చెల్లించాల్సి ఉంటుందనే దానిపై కూడా చర్చించారు.

అంతే కాకుండా రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాన్ని కూడా వచ్చే నెల నుంచే అమలు చేయాలని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ రూ.10 లక్షలకు పెంచారు. అయితే మిగతా గ్యారెంటీలకైనా అర్హతలు నిర్ణయించాలని డిమాండ్లు ఉన్నాయి. చాలా మంది ఐటీ చెల్లించే ఉద్యోగులు కూడా రేషన్ కార్డులకు అప్లై చేసుకున్నారు. ఇళ్లకు అప్లై చేసుకున్నారు. అలాగే 10 ఎకరాలకు పైన ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకున్నారు.

# సంపాదకీయం

## చరిత్ర చూడు

### వారసత్వానికి కూడా జనమే ఓటేయాలి......!

భారతదేశంలో వారసత్వం పట్ల మక్కువ ఎక్కువ. ఎంత ఆధునిక పోకడలు ఉన్నా కూడా వారసులను ముందుకు తెస్తారు రాజుల కాలం కాదు కానీ వారసులకు మాత్రం తిరుగులేకుండా పోతోంది. అది ఏ రంగం అయినా వారసులదే రాజ్యం. అయితే వారసత్వం కూడా అంత ఈజీగా దక్కదు. దానికీ ఇంటా బయటా ఎన్నో పోరాటాలు చేయాలి. ప్రజలు కూడా ఒక నాయకుడికి పిల్లలు ఎంత మంది ఉన్నా అందులో సమర్థుడికే ఓటేసి వారసత్వ పీఠం ఎక్కిస్తారు. ఇలా చూసుకుంటే దేశంలో చాలా చోట్ల జరిగింది. ఉత్తరాదిన చూస్తే సమాజ్ వాది పార్టీకి ములాయం సింగ్ యాదవ్ చీఫ్ గా ఉంటూ పార్టీ పెట్టారు. ఆయన రాజకీయ వారసుడిగా అఖిలేష్ కుదురుకున్నారు. ఆ తరువాత తండ్రి రెండవ భార్య కుమారుడు వచ్చినా కూడా ప్రయోజనం లేకపోయింది. ఇక మహరాష్ట్రలో శివసేనలో బాల్ థాక్రే ఉండగానే సొంత కొడుకు సోదరుడి కొడుకూ ఇద్దరూ వారసత్వం కోసం పోటీ పడ్డారు. చివరికి సోదరుడి కొడుకు బయటకు వెళ్లారు సొంత కొడుకు ఉద్ధవ్ థాక్రే పార్టీని నడిపిస్తున్నారు సీఎం కూడా అయ్యారు. బీహార్ లో చూసుకుటే మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కి కుమారులు కుమార్తెలు ఎక్కువ మందే ఉన్నారు. కానీ చిన్న కుమారుడు తేజశ్వి యాదవ్ నే జనాలు ఆయన రాజకీయ వారసుడిగా గుర్తించారు. ఆయనే ఫ్యూచర్ సీఎం అంటున్నారు. దక్షిణాదికి వస్తే డీఎంకే తిరుగులేని ప్రాంతీయ పార్టీగా ఉంటోంది. ఆ పార్టీలో కరుణానిధి తొంబై ఏళ్ల పైబడి జీవించి ఆధిపత్యం చలాయించారు. ఆయనకు ముగ్గురు భార్యలు ఉన్నారు. వారసులు కూడా ఎక్కువ. పెద్ద కుమారుడు అళగిరి చిన్న కుమారుడు స్టాలిన్ మధ్య వారసత్వ పోరు వచ్చింది. జనాలు మాత్రం స్టాలిన్ వైపే మొగ్గు చూపారు. ఆయన నాయకత్వంలోనే పార్టీ ఒక్కటిగా ఉండి అధికారంలోకి వచ్చింది. కర్నాటకలో చూసుకుంటే మాజీ ప్రధాని దేవేగౌడ కు వారసులు ఎక్కువ. ఆయన చిన్న కుమారుడు కుమార స్వామి తండ్రికి సిసలైన వారసుడిగా ఉంటూ సీఎం అయ్యారు. పెద్ద కుమారుడు రేవణ్ణ మంత్రి పదవితోనే సర్దుకోవాల్సి వచ్చింది. ఇక తెలంగాణాలో చూసుకుంటే బీఆర్ఎస్ లో కేసీఆర్ కి వారసత్వ పోరు బయటకు కనిపించని తీరులో ఉంది. కుమారుడు కేటీఆర్ పార్టీని లీడ్ చేస్తున్నారు. మరో వైపు మేనల్లుడు హరీష్ రావు, కవిత కూడా ఉన్నారు. వారు కూడా సమర్థులే అనిపించుకుంటున్నారు. ఇక తెలుగు రాజకీయ తేజం అన్న గారి కుటుంబంలో అతి పెద్ద రాజకీయ పోరుకు తెర లేచింది. ఎన్టీయార్ వారసుడు ఎవరు అని ఒక చర్చ చాలా కాలం క్రితం సాగింది. అల్లుళ్ళ కుమారులు రెండవ భార్య ఇలా చాలా మంది ఉంటే చివరికి అది చంద్రబాబుకే అని జనాలు నిర్ధారించారు. ఇపుడు వైఎస్సార్ కుటుంబంలో వారసత్వ పోరుకు తెర లేచింది. 2019 దాకా అన్న జగన్ కి అవుట్ రేట్ గా మద్దతు ఇచ్చిన చెల్లెలు షర్మిల ఇపుడు వైఎస్సార్ తనయగా కాంగ్రెస్ నుంచి పోటీకి వస్తున్నారు. జనాలు రాజన్న వారసురాలిగా తనను ఆదరించాలని ఆమె కోరుతున్నారు. అయితే వైఎస్సార్ వారసత్వం జగన్ కే కట్టబెడుతూ జనాలు 2011 నుంచే తీర్పులు ఇస్తూ వస్తున్నారు అన్నది వైసీపీ నేతల వాదన. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ రాజకీయ వారసత్వం కోసం అన్నాచెల్లెళ్ళ మధ్య పోరు సాగనుంది. తీర్పు ఏమిటి అన్నది చూడాల్సి ఉంది. ఏది ఏమైనా ఒక్క మాట ఇక్కడ చెప్పుకోవాలి. వారసత్వం అన్నది ఈజీ టాస్క్ కాదు. జనాల మెప్పు ఉన్న వారికే అది దక్కుతుంది. జవస త్వాలను నమ్ముకోమని సీనియర్ పొలిటీషియన్స్ చెబుతారు. వారసులు కూడా జవసత్వాలు కలిగి ఉంటేనే వారసులుగా గట్టిగా నిలబడతారు అన్నది నిజం.

# భారతవనిని బానిస సంకెల నుండి విముక్తి కొరకు పోరాడిన వీర యోధుడు నేతాజీ...

### ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు



శామీర్ పేట, (గరుడ వార్త): స్వాతంత్ర సమరయోధుడు భారతవనిని బానిస సంకెళ్ల నుంచి కాపాడేందుకు పోరాడిన యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127 వ జయంతి వేడుకలు మండల కేంద్రం శామీర్ పేటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్టార్ యువజన సంఘం, చైతన్య యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నేతాజీ జయంతి వేడుకలు కన్నుల పండుగ జరిగాయి. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, విలేకరులు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఆంగ్లేయ పాలనలో భారత ప్రజలు ఇబ్బందులు పడుతున్న దుస్థితిని చూసి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హిందూ ఫౌజ్ సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆంగ్లేయులతో పోరాడి భారత దేశ బానిస సంకెళ్ళలకు బంధ విముక్తుడిగా చేసిన ఘనత ఆయనకు దక్కిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. భారత దేశంలో సూర్యచంద్రులు ఉన్నంతవరకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ను ప్రజలు మరువరని గుర్తు చేశారు. ప్రతి యువకుడు ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అఫ్జల్ ఖాన్ ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు బండి శ్రీరాముడు గౌడ్, శామీర్ పేట కల్లు గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు దేశం సంతోష్ గౌడ్, స్టార్ యువజన సంఘం అధ్యక్షుడు తూంకుంట శేఖర్ గౌడ్, సంఘం సభ్యులు గుల్యా గారి చంద్రశేఖర్ గౌడ్, గుల్య గారి నాగరాజ్ గౌడ్, దేశం బాల్ రాజ్ గౌడ్, దూడల వెంకటేష్ గౌడ్, ముత్యాల నరేష్ చారి, జూపల్లి వేణు, మమ్మద్ నసీర్, శామీర్ పేట గ్రామపంచాయతీ వార్డు సభ్యులు దూడల శ్రీకాంత్ గౌడ్, దొంతర బోయిన నవీన్ కుమార్ ముదిరాజ్, దేశ బోయిన సత్యనారాయణ ముదిరాజ్, శామీర్ పేట మండల బిజెపి ఉపాధ్యక్షుడు పవన్ గౌడ్, బిజెవైఎం జిల్లా కార్యదర్శి బోయిని శివ, శామీర్ పేట మండల జనసేన అధ్యక్షుడు బండారి దుర్గారావు, పుట్ల గారి విష్ణు, మాజీ వార్డు సభ్యుడు బుర్క చిన్న యాదగిరి, చాగంటి రమేష్ ముదిరాజ్, వంగ సత్తిరెడ్డి, శామీర్ పేట భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు మేస్త్రి శ్రీను, బందేలి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

తూముకుంట మున్సిపల్ లో... సుభాష్ చంద్రబోస్ గారి జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని పోతాయిపల్లి లో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తిగుళ్ళ మురళి గౌడ్, తిగుళ్ళ దర్శన్ గౌడ్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని సుభాష్ చంద్రబోస్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గూడూరు మోహన్ రెడ్డి,మున్సిపల్ కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షులు పెండం లక్ష్మీనారాయణ, మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ చిర్రబోయిన రాంచందర్ యాదవ్, మున్సిపల్ పరిధిలోని 1 వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు రాజ్ పుత్ భరత్ సింగ్,15 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతల బల్వంత్ రెడ్డి గార్లు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ





శామీర్ పేట (గరుడ వార్త): శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేటలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అల్వాల్ ప్రాంతానికి చెందిన జాతవత్ పుల్యా నాయక్ నీలమ్మ దంపతులు, వారి కుమారులు శివకుమార్, సంజీవ కుమార్ లు అన్నదానం చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు అన్నదానంలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

# జిల్లాను అన్ని శాఖల సమన్వయంతో మరింత అభివృద్ధికి కృషి చేయాలి..

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ శరత్ చంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమ్...







జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త) : మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి ఆనుకొని ఉండటం వల్ల ఎంతో అభివృద్ధి చెందిందని, ముమ్ముందు మరింత అభివృద్ధి జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా పరిషత్ ఛైర్మన్ మలిపెద్ది శరత్చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ శరత్ చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ఉందన్నారు. అధికారుల కృషి, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతోందని తెలిపారు. జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు ఇదే తరహాలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జడ్పీ ఛైర్మన్ శరత్ చంద్రారెడ్డి కోరారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ, జిల్లా పంచాయతీ శాఖ, జిల్లా ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ,లు చేపడుతున్న కార్యక్రమాలు, వివిధ అంశాలపై సంబంధిత అధికారులు సమావేశంలో ప్రజాప్రతినిధులకు స్పష్టంగా వివరించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ శరత్ చంద్రారెడ్డి, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల అధికారులు సమాధానాలిచ్చి... అందుకు సంబంధించి పూర్తి వివరాలను తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని వాటిని ప్రజలకు చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఇతర సభ్యులు కొన్ని సమస్యలను లేవనెత్తగా కలెక్టర్ గౌతమ్ వారికి అవసరమైన వివరాలు, సమాచారాన్ని, వారికీ తెలిపినారు . అలాగే ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే త్వరితగతిన పరిష్కరిస్తానని సమావేశంలో సానుకూలంగా తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు లేకుండా అందరి సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తున్నామని.. రాబోయే రోజుల్లో కూడా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గౌతమ్ సమావేశంలో వివరించారు. జిల్లాలో అధికారులు ఎంతో బాగా తమ విధులు నిర్వహిస్తున్నారని ఇదే స్ఫూర్తితో మరింత బాగా పని చేయాలన్నారు. అలాగే జిల్లాలో గ్రామపంచాయతీల్లో ఆయా బిల్లుల వసూళ్ళు సక్రమంగా జరగడంలేదని ఈ విషయంలో అవసరమైన సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ గౌతమ్ వివరించారు. వీటికి సంబంధించి ఇబ్బందులను వెంటనే పరిష్కరిస్తామన్నారు. దీంతో పాటు ట్యాక్సులు తప్పకుండా వసూలు చేయాలని... ట్యాక్సులు సరిగ్గా వసూలు చేసినట్లయితేనే అభివృద్ధి పనులు చేసుకునేందుకు ఆస్కారముంటుందని ఈవిషయాన్ని అధికారులు దృష్టిలో పెట్టుకోవాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలోని డబుల్ బెడ్రూమ్లకు సంబంధించి ప్రభుత్వ పాలసీ ప్రకారం ఉందని... ఈ విషయంలో ప్రభుత్వానికి అవసరమైన నివేదికలు అందచేస్తామని వారి సూచనల మేరకు నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న వాటిలో చాలా వరకు అలాట్మెంట్ జరిగిందని.. వాటిలో తప్పులున్నాయని తెలిపారని ఈ విషయంలో ఎక్కడైనా తప్పులు ఉన్నాయా ? లేదా ? అనే వివరాలను తెలుసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ గౌతమ్ సమావేశంలో స్పష్టం చేశారు. అలాగే ఇంకా నిర్మాణం పూర్తి కాని వాటిని పూర్తి చేసి అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా జడ్పీ వైస్ ఛైర్మన్ బెస్త వెంకటేశ్, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, జిల్లా శాఖ అధికారులు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ ను సన్మానించిన ప్రజాప్రతినిధులు, మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా పరిషత్ సర్వసభ్య మొట్టమొదటిసారిగా హాజరైన జిల్లా కలెక్టర్ గౌతమ్ను జిల్లా పరిషత్ ఛైర్మన్ శరత్ చంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ వెంకటేశ్, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు,ఎంపీపీలు, శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జయంతి తప్ప వర్ధంతి లేని ఏకైక స్వాతంత్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జైపాల్ రెడ్డి

శామీర్ పేట (గరుడ వార్త) : జయంతి తప్ప వర్ధంతి లేని ఏకైక స్వాతంత్ర సమరయోధుడని నేతలు కొనియాడారు. స్వాతంత్ర సమర యోధులు సుభాష్ చంద్రబోస్126 వ జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని పోతాయిపల్లిలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి తిగుళ్ళ మురళి గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తిగుళ్ళ దర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి




అర్పించారు. సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ జయంతి తప్ప వర్ధంతి లేని మహావీరుడు సుభాష్ చంద్రబోస్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి,మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి,మున్సిపల్ కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షుడు పెండం లక్ష్మీనారాయణ, మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ చిర్రబోయిన రాంచందర్ యాదవ్,మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు రాజ్ పుత్ భరత్ సింగ్,15 వ వార్డు అధ్యక్షుడు చింతల బల్వంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానవాపీ, షాహీ ఈద్గానూ హిందువులకు అప్పగించాలి

న్యూఢిల్లీ : అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ జరిగిన నేపథ్యంలో సీనియర్ పురావస్తు శాస్త్రవేత్త కె.కె.మొహమ్మద్ ఆసక్తికర సూచన చేశారు. వివాదాస్పద జ్ఞానవాపీ మసీదు (కాశీ), షాహీ ఈద్గా మసీదు (మథుర)లను హిందువులకు అప్పగించాలని కోరారు. భారత పురావస్తు సర్వే విభాగం(ఏఎసఐ) రీజనల్ డైరెకర్‌గా పదవీ విమరణ చేసిన ఆయన బాబ్రీ మసీదు వద్ద తవ్వకాల్లో కీలక పాత్ర పోషించారు. మందిరం ఉండేదనడానికి అక్కడ చాలా ఆధారాలు లభించాయని, మందిరాన్ని కూలగొట్టి మసీదును నిర్మించారన్న వాదనను సమర్థించారు. అయోధ్య, మధుర, వారణాసి క్షేత్రాలు హిందువులకు పరమ పవిత్రమైనవని, అక్కడి మసీదులపై ముస్లింలకు ఎలాంటి సెంటిమెంట్లు లేవని తెలిపారు. అన్ని మతాల పెద్దలు కూర్చొని వీటిని హిందువులకు అప్పగించే విషయమై చర్చలు జరపాలని కోరారు.

# బడికి రక్షణేదీ?

సూర్యాపేట : పాఠశాల ఆవరణ ప్రశాంతంగా ఉండాలంటే చుట్టూ ప్రహరీ ఉండాలి.. అప్పుడే విద్యార్థులు చదువుపై దృష్టిసారిస్తారు. జిల్లాలో చాలా ప్రభుత్వ బడులకు రక్షణ లేక పశువులు, పందులు సంచరిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మండలాల్లో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు 712 ఉన్నాయి. వాటిలో 393 పాఠశాలలకు ప్రహరీలు లేక విద్యార్థులకు రక్షణ కరవైంది. ప్రభుత్వం నూతనంగా పాఠశాలలకు నిర్మాణాలు చేపట్టినా నిధులు లేక మధ్యలోనే ఆగిపోయాయి. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా మాటలు నీటి మీద రాతలుగా మారాయి. ప్రహరీలు, వాచ్‌మెన్ లేకపోవడంతో బడి ఆవరణలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్నాయి. రాత్రి వేళ మందుబాబులు మద్యం తాగి సీసాలు అక్కడే పగలగొడుతున్నారు. సెలవు రోజుల్లో, రాత్రి వేళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు మలమూత్ర విసర్జన చేయడంతో దుర్వాసన వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు శునకాలు, వానరాలు, పశువులు, పందులు పాఠశాల ఆవరణలో సంచరిస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. అక్కడ నాటిన మొక్కలు కూడా దక్కడం లేదు. ఇక రహదారి పక్కన ఉన్న పాఠశాలల్లో సమస్య తీవ్రంగా ఉంది. విరామ సమయంలో విద్యార్థులు ఆటలు ఆడుతూ రోడ్లపైకి వెళ్తుండటంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. చుట్టూ గోడలు లేకపోవడంతో పాఠశాల స్థలం కూడా ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వలిగొండ మండలం దుప్పల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో దసరా సెలవు రోజుల్లో మందుబాబులు గదుల తలుపులు ధ్వంసం చేశారు. మద్యం సీసాలు పగులగొట్టారు. మాంసం బొక్కలు, సిగరెట్లతో అపరిశుభ్రం చేశారు.

గుండాల మండలం సుద్దాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణ రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా మారింది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం–కె.నారాయణరెడ్డి, జిల్లా విద్యాధికారి, యాదాద్రిభువనగిరిజిల్లాలో కొన్ని పాఠశాలలకు పూర్తి స్థాయిలో ప్రహరీలు లేవు. మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా 68 పాఠశాలల్లో నిర్మాణాలు చేపట్టాం. ప్రహరీలు అవసరమైన పాఠశాలలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే నిర్మాణాలు చేపడతాం.

## ఇక పాఠశాలలకు నూతన ఎస్ఎంసీలు

నడిగూడెం : ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)లకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రెండేళ్లుగా కమిటీకి ఎన్నికలు లేవు. మధ్యాహ్న భోజన కార్యక్రమ పరిశీలన, బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించడం, విద్యార్థుల హాజరు శాతం పెంపొందించడం, ఉపాధ్యాయుల బోధన, పనితీరును పర్యవేక్షించడం, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసేందుకు ప్రభుత్వం విద్యాహక్కు చట్టం ప్రకారం 2009 నుంచి పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేసింది. 2019 వరకు ఎన్నికలు నిర్వహిస్తూ వచ్చింది. చివరగా 2019 నవంబరులో కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీల పదవీ కాలం రెండు సంవత్సరాల వరకు ఏర్పాటు చేశారు. 2021 నవంబరుతో పాత కమిటీల గడువు ముగిసింది. కాని అప్పుడు కరోనా పరిస్థితులు ఉండటంతో ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు వాయిదా వేసింది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి చొప్పున వాయిదా వేస్తూ వచ్చారు. చివరగా మరోసారి ఎస్ఎంసీ ఎన్నికలు ఒక నెల వాయిదా వేశారు. డిసెంబరు 31వరకు వాయిదా వేశారు. ఆ గడువు కూడా ముగియడంతో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈనెల 29న ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నేడు నోటిఫికేషన్ విడుదల:అన్ని పాఠశాలలకు ఈనెల 20న ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. మధ్యాహ్నం విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాను ప్రకటిస్తారు. 22, 23 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరిస్తారు. 24న విద్యార్థుల తల్లిదండ్రుల తుది జాబితా ప్రకటన చేస్తారు. 29న ఎన్నికలు నిర్వహిస్తారు. రెండేళ్లుగా కమిటీలకు ఎన్నికలు లేకపోవడం వల్ల పాత కమిటీతోనే కాలం గడిపారు. రెండేళ్లపాటు ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కమిటీల్లో ఉన్న వారి కొందరి పిల్లలు పాఠశాలలో లేకపోయినా వారినే కొనసాగిస్తూ వచ్చారు. ఎస్ఎంసీ కమిటీలు ఉండటం వల్ల క్రమం తప్పకుండా కమిటీలు పాఠశాలలను పర్యవేక్షణ చేస్తుండేవి. ఏ లక్ష్యాలతో అయితే ఎస్ఎంసీలు ఏర్పాటు చేశారో వాటి లక్ష్యాలు నెరవేరుతుండేవని అందరూ ఒప్పుకొంటున్న నిజం. ప్రస్తుతం రెండు సంవత్సరాలుగా కమిటీలు లేకపోవడం వల్ల చాలా విషయాల్లో పాఠశాలల్లో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కమిటీల వల్ల నాణ్యమైన విద్య, పోషక విలువలు ఉన్న మధ్యాహ్న భోజనం, విద్యార్థుల ప్రగతిపై నిత్యం పర్యవేక్షణ ఉండేది. సుదీర్ఘ కాలంపాటు ఉండటం, కొన్ని చోట్ల వారి పిల్లలు కూడా లేకపోవడంతో కొంత నిర్లక్ష్యానికి గురయ్యాయి. ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించనుండటంతో పాఠశాలలకు కొత్త కమిటీలు రానున్నాయి.

ప్రత్యేక సమావేశాల్లో..కమిటీల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. విధివిధానాలు వివరించి మొదట ప్రతి తరగతి నుంచి ముగ్గురు ప్రతినిధులను, ఆ తర్వాత మళ్లీ ప్రత్యేకంగా సమావేశమై ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎన్నుకుంటారు. ఈ కమిటీల్లో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్త, మహిళా సమాఖ్య సభ్యురాలికి ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఎంపికయ్యే తల్లిదండ్రుల్లో కేటగిరీల వారీగా రిజర్వేషన్లు అమలు చేస్తారు.

విధులు, బాధ్యతలు..మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, పాఠ్య పుస్తకాల పంపిణీని ఎస్ఎంసీ ఛైర్మన్ వైస్‌ఛైర్మన్లు పర్యవేక్షిస్తారు. 'మన ఊరు–మన బడి' పనులు పరిశీలిస్తారు. మూత్రశాలలు, శుద్ధి నీరు, మైదానాలు, క్రీడా సామగ్రి, తదితర సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేయాలి. పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి. నిర్వహణ నిధులు ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ ఛైర్మన్ ఉమ్మడి ఖాతాలో జమవుతాయి. వీటిని విద్యా కమిటీ పర్యవేక్షలో సక్రమంగా వినియోగించాలి.

ఎన్నిక విధానం..జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఆశ్రమ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు,

యూఆర్ఎస్(అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్), ఆదర్శ పాఠశాలల్లో నిబంధనల ప్రకారం ఎస్ఎంసీల ఎన్నికలు నిర్వహించాలి. ప్రాథమిక పాఠశాలల్లో 10, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 14, ఉన్నత పాఠశాలల్లో 10 మంది సభ్యులతో కమిటీలను ఎన్నుకుంటారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగుతాయి. ఆరుగురు ఎక్స్ అఫీషియో, ఇద్దరు కోఆప్షన్ సభ్యులుంటారు. సదరు బడిలో చదివే పిల్లల తల్లిదండ్రులే సభ్యులుగా కొనసాగుతారు. వారి పిల్లలు పాఠశాలను వదిలి వెళ్లినట్లయితే పదవి కోల్పోతారు. ఓటర్లలో 50 మంది హాజరవకపోతే కోరం లేనట్లే. సభ్యులు చేతులెత్తే పద్ధతి లేదా మూజువాణి ఓటుతో కమిటీని ఎన్నుకుంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటేస్తారు.

నిబంధనల మేరకు ఎన్నికలు– భిక్షపతి, జిల్లా విద్యాధికారి, నల్గొండ

పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలపై ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 29న ఎన్నికలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ కమిషనర్ తెలిపారు. నిబంధనల ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేస్తాం.

# బాధ్యతలు ముగుస్తున్నా బకాయిల జాడేదీ!



పెద్దపల్లి : పెద్దపల్లి మండలం మూలసాలలో రూ.4 లక్షలతో మురుగు కాలువ నిర్మించారు. ఆరు నెలలుగా బిల్లుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఎంబీ రికార్డులు నివేదించినా విడుదలకు నోచుకోవడం లేదు.పంచాయతీల పాలకవర్గాల గడువు ఈ నెలాఖరులో ముగుస్తుండటంతో పెండింగ్ బిల్లులపై సర్పంచుల్లో ఆందోళన నెలకొంది. గతంతో పోలిస్తే గడిచిన అయిదేళ్లలో పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు వెచ్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలతో పాటు ఉపాధిహామీ నిధుల అనుసంధానంతో డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లు, శ్మశానవాటికలు, సీసీ రోడ్లు, మురుగుకాలువలు తదితర నిర్మాణాలను పోటీ పడి పూర్తి చేశారు. రూ.లక్షల్లో చేసిన అభివృద్ధి పనులకు సకాలంలో బిల్లులు రాక సర్పంచులు అప్పుల పాలయ్యారు. బిల్లుల విషయమై పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీ కాలం ముగిసిన అనంతరం పాలన ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లనుంది. దీంతో బకాయి బిల్లుల పరిస్థితి ఏమిటని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు.

జనాభా ప్రాతిపదికన నిధులు

గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి ప్రతి నెలా నిధులు మంజూరవుతున్నాయి. జనాభా ప్రాతిపదికన వీటిని కేటాయిస్తున్నారు. జిల్లాలో 266 పంచాయతీల ఖాతాల్లో ప్రతి నెలా రూ.6 కోట్లు జమవుతున్నాయి. ఇవి కూడా రాకపోవడంతో చిన్న పంచాయతీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పల్లెలకు ఇతర ఆదాయ వనరులు లేకపోవడం, నిధుల వాటా తక్కువ ఉండటంతో ప్రతి పనికీ దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత సర్పంచులు 2019 ఫిబ్రవరిలో బాధ్యతలు చేపట్టిన తొమ్మిది నెలల తర్వాత చెక్ పవర్ ఇవ్వడం గమనార్హం.

కిస్తులు చెల్లించేదెలా!

పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపునకు పంచాయతీకొక ట్రాక్టరు కొనుగోలు చేశారు. చెత్త సేకరణతో పాటు హరితహారం, పల్లె ప్రకృతివనాలు, మొక్కల సంరక్షణకు వీటి ద్వారా నీళ్లు పడుతున్నారు. చిన్న పంచాయతీలు కూడా మినీ ట్రాక్టర్ల ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయితే ట్రాక్టరు కొనుగోలుకు వెచ్చించిన డబ్బుకు సంబంధించిన కిస్తుల చెల్లింపు పంచాయతీలకు గుదిబండగా మారింది. డీజిల్ బిల్లులు పేరుకుపోతున్నాయి. చాలా చోట్ల డ్రైవర్లకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో వాహనాలు మూలనపడ్డాయి. మరికొన్ని చోట్ల పారిశుద్ధ్య సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. పంచాయతీ నిధులతో పాటు 'మన ఊరు–మన బడి', డీఎంఎఫ్‌టీ, సీనరేజ్ ఇతర అభివృద్ధి పథకాల నిధులతో చేసిన పనులకు కూడా బిల్లులు రాలేదు.

రూ.కోట్లలో బిల్లుల పెండింగ్

కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నిర్దేశిత గడువులోగా ఎన్నికలు నిర్వహించాలి. కుదరకపోతే ప్రత్యేక అధికారుల పాలన కొనసాగించాలి. ప్రస్తుతం పాలకవర్గాల గడువు సమీపిస్తుండటంతో ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదు. గతంలో ఎన్నికలు నిర్వహించే వరకు సర్పంచులే పర్సన్ ఇన్‌ఛార్జులుగా వ్యవహరించేవారు. కొత్త చట్టం ప్రకారం ఈ విధానం అమలు సాధ్యం కాదు. దీంతో ప్రత్యేక అధికారుల పాలన అనివార్యం కానుంది. పంచాయతీలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే బిల్లులు జిల్లాలో రూ.5.20 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇతర అభివృద్ధి పథకాలకు సంబంధించి రూ.కోట్లలో బకాయిలుంటాయని సర్పంచులు చెబుతున్నారు.

రూ.25 లక్షలు రావాలి

గ్రామంలో సీసీ రోడ్లు, మురుగుకాలువలు నిర్మించాం. తాగునీటి బోర్ల తవ్వకం, పారిశుద్ధ్య పనులు చేపట్టాం. దశాబ్ది ఉత్సవాల నిర్వహణ ఖర్చులు కూడా ఇవ్వలేదు. రూ.25 లక్షల వరకు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది.

సముద్రాల రమేష్, సర్పంచి, ఖమ్మంపల్లి, ముత్తారం మం.

నెలల తరబడి ఎదురుచూపులే

రూ.20 లక్షలతో పంచాయతీ భవనం, రూ.12 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించా. మురుగుకాలువతో పాటు పారిశుద్ధ్య పనులకు సంబంధించి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నా. నెలలు గడుస్తున్నా బిల్లులు రావడం లేదు.బాపయ్య, సర్పంచి, కుర్మపల్లి, పెద్దపల్లి మం.

# కొలువుల భర్తీకి రాజకీయం



సూర్యాపేట : కలెక్టరేట్‌లో ఇప్పటికే ఏడుగురు సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. పది రోజుల క్రితం మరొకరిని ఒప్పంద ప్రాతిపదికన సెక్యూరిటీ గార్డు పోస్టుకు ఎంపిక చేశారు. ఆయన విధుల్లో చేరిన తరువాత ఏజెన్సీకి అప్పగించారు. పేపర్ ప్రకటన ద్వారా కొలువు భర్తీ చేయాల్సిన ఉన్నా.. అకస్మాత్తుగా నియమించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.లక్షన్నరకు ఆయన కొలువు కొనుక్కున్నట్లు తెలిసింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ సముదాయంలో ఒప్పంద కొలువుల భర్తీలో అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధుల జోక్యంతో నచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చి అర్హులకు మొండిచేయి చూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో నూతన కలెక్టరేట్ను ప్రారంభించిన అనంతరం ఇబ్బడిముబ్బడిగా ఒప్పంద ఉద్యోగులను భర్తీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కొలువులు కట్టబెట్టారనే విమర్శలు ఉన్నాయి. వీటి కేటాయింపులో భారీ మొత్తమే చేతులు మారినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

తొలుత నియామకం.. తరువాత ఏజెన్సీలకు అప్పగింత

నూతనంగా కలెక్టరేట్ను ప్రారంభించిన అనంతరం ఏడుగురు సెక్యూరిటీ గార్డులు, ముగ్గురు స్వీపర్లను నియమించారు. ఇటీవల మరో ఇద్దరిని సెక్యూరిటీ గార్డులను నియమించినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ఒప్పంద పద్ధతిన ఉద్యోగాలు భర్తీ చేసే సమయంలో సీనియారిటీ ప్రకారం ఏజెన్సీలను పేపర్ ప్రకటన ద్వారా ఎంపిక చేయాలి. ఆ ఏజెన్సీల ద్వారా ఉద్యోగాలు భర్తీ చేయాలి. కానీ, ఇవేవీ పాటించకుండా రాజకీయ నాయకుల నిర్ణయం ప్రకారం తమకు నచ్చిన వారికి ఉద్యోగాలిచ్చారు. వారు విధుల్లో చేరిన తరువాత ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడం గమనార్హం. కలెక్టరేట్ ప్రారంభానికి ముందే సెక్యూరిటీ గార్డ్, స్వీపర్ల నియామకం, క్యాంటీన్ కేటాయింపులకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రెస్‌నోట్ సిద్ధం చేశారు. టెండర్ నోటీస్ ఇవ్వాలని నిర్ణయించి దాన్ని నిలిపివేసినట్లు ప్రచారం జరిగింది. కలెక్టరేట్ ప్రారంభమైన తరువాత టెండర్ నోటీస్ జారీ చేయకుండా నియామకాలు చేపట్టడంలో ఏదో మతలబు ఉందని అర్థమవుతోంది. ఎన్నికల కోడ్ సమయంలోనూ ఓ శాఖలో గుట్టుచప్పుడు ఒప్పంద పద్ధతిన ఉద్యోగాలు భర్తీ చేయడం శోచనీయం.

రూ.2 లక్షలకు ఒక ఉద్యోగం!

సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంలో 48 శాఖల జిల్లా కార్యాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం కొన్ని శాఖల్లో రూ.2 లక్షలకు ఒప్పంద ఉద్యోగాలు ఇస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. కొన్ని శాఖల్లో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రూ.2 లక్షలు ఇస్తే.. ఇప్పిస్తామని కొందరు మధ్యవర్తులు నిరుద్యోగులకు ఎరవేస్తున్నారు. మధ్యవర్తుల జోక్యాన్ని అరికట్టి నిరుద్యోగులు మోసకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

త్వరగా కేటాయించాల్సి ఉండటంతో ప్రకటన ఇవ్వలేదు

–వెంకట్రెడ్డి, అదనపు కలెక్టర్, సూర్యాపేట

కలెక్టరేట్ ప్రారంభించే తేదీ మారడంతో ముందుగా సిద్ధం చేసిన ప్రకటన ఇవ్వలేదు. మళ్లీ ఇచ్చేందుకు సమయం లేకపోవడంతో ఉద్యోగులను భర్తీ చేసిన తరువాత ఏజెన్సీలకు అప్పగించాం. ఏజెన్సీల ద్వారానే వేతనాలు చెల్లిస్తున్నాం. రూ.2 లక్షలకు ఒప్పంద ఉద్యోగాలను అనే ప్రచారాన్ని నిరుద్యోగులు నమ్మొద్దు.

# భూముల రక్షణకు సాంకేతిక మంత్ర

హైదరాబాద్: అత్యంత విలువైన భూముల రక్షణకు హెచ్ఎండీఏ సాంకేతిక మంత్రం ప్రయోగించనుంది. చాలా భూములకు ఇప్పటికే కంచెలు నిర్మిస్తోంది. మిగిలిన వాటికి జియోట్యాగ్ చేయాలని నిర్ణయించింది. త్వరలో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. సంస్థ పరిధిలోని ఏడు జిల్లాల పరిధిలో వందల ఎకరాల విలువైన భూములు ఉన్నాయి. ఇప్పటికే కొన్ని భూములను ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించింది.

రాత్రివేళల్లో నిర్మాణాలు: హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి పరిధిలో హెచ్ఎండీఏకు వేల కోట్ల విలువైన భూములు ఉన్నాయి. కొందరు వీటిని తప్పుడు రికార్డులు సృష్టించి హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవలి శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 181 ఎకరాల భూముల్లో ఏకంగా 50 ఎకరాలను ఓ స్థానిక ప్రజాప్రతినిధి అండతో ఆక్రమించారు. తప్పుడు సర్వే నంబరుతో వాటిని తమ చేతుల్లోకి తీసుకున్నారు. చివరికి సుప్రీంకోర్టు కోర్టుకు వరకు వెళ్లి ఆక్రమణదారులను అడ్డుకున్నారు. ట్రక్ టెర్మినల్ పార్క్ నిర్మాణం కోసం 1990లో హెచ్ఎండీఏ ఈ భూమిని సేకరించింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ఈ భూముల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోనుంది. ఆయా భూములను జియోట్యాగ్ చేయడం వల్ల అక్కడ ఎలాంటి నిర్మాణాలు జరిగినా సరే.. గూగుల్ ఇమేజ్‌లతో ఇట్టే తెలిసిపోతుంది. వెంటనే అధికారులకు నోటిఫికేషన్ ద్వారా సమాచారం అందుతుంది. వెంటనే స్థానిక అధికారులు అప్రమత్తమై అడ్డుకునేందుకు అవకాశం ఉంటుంది.

# కాటికెళ్లి ఆరేళ్లు.. ఆగని కన్నీళ్లు..!

నల్గొండ : క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం, బాధితుల పట్ల ప్రజాప్రతినిధులకు మమకారం లేకపోవడంతో నల్గొండ జిల్లాలోని సుమారు 20కి పైగా రైతు ఆత్మహత్య కుటుంబాలకు ఇప్పటికీ పరిహారం దక్కడం లేదు. గత భారాస తొలి ప్రభుత్వంలో (రైతుబీమా పథకం అమల్లో లేనప్పుడు) ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు మండల, డివిజన్ స్థాయిలో ముగ్గురు సభ్యుల అధికారిక బృందం ఆమోదిస్తే ప్రభుత్వం నుంచి రూ.6లక్షల పరిహారం దక్కే విధంగా పథకం అమలయింది. ఆ సమయంలో ఆత్మహత్య చేసుకున్న చాలా కుటుంబాలకు పరిహారం దక్కగా..కొంత మంది క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కొందరు పరిహారానికి దూరమయ్యారు. వీరికి మద్దతుగా స్వచ్ఛంద సంస్థ అయిన ఆర్ఎస్‌వీ ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా పరిహారం దక్కని బాధిత కుటుంబాలను కలిసి వారి తరఫున 2022లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) దాఖలు చేశారు. దీంతో కేసును విచారించిన కోర్టు క్షేత్రస్థాయిలో మరోసారి విచారణ చేసి బాధితులకు ఈ ఏడాది మార్చి 20 కల్లా పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. యాదాద్రి, సూర్యాపేటలోని సుమారు 35 మంది బాధిత కుటుంబాలను కలిసి పునర్విచారణ చేసిన ఆయా జిల్లాల అధికారులు వారంతా అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నారని కోర్టుకు నివేదించారు. నల్గొండ జిల్లాలో మాత్రం ఎక్కడా క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండానే 20కి పైగా కేసులను తిరస్కరించినట్లు తెలిసింది. మరోసారి క్షేత్రస్థాయి విచారణ చేసి తమకు న్యాయం



చేయాలని బాధిత కుటుంబాలతో కలిసి ఆర్ఎస్‌వీ సభ్యులు ఈ నెల 25న నల్గొండ కలెక్టరు హరిచందనను కలవనున్నట్లు తెలిసింది.

అన్నింటికీ ఒకటే కారణం..!

జిల్లాలో మొత్తం 20 మంది రైతు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను కలిసి పునర్విచారణ చేయాల్సి ఉండగా..తొమ్మిది మంది బాధిత కుటుంబాలను కలవకుండానే అన్నింటికీ ఎఫ్ఐఆర్ కాపీలు సరిగ్గా లేవని చెబుతూ వాటిని తిరస్కరించడం గమనార్హం. పోలీసులు ఎఫ్ఐఆర్‌తో పాటూ పలుచోట్ల ఆత్మహత్యలపై ఛార్జ్‌షీట్లు సైతం దాఖలు చేయడం గమనార్హం. దీన్ని బట్టి అధికారుల క్షేత్రస్థాయి విచారణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దేవరకొండ, నేరేడుగొమ్ము, చందంపేట, పీఏపల్లి, నాంపల్లి మండలాల్లో ఈ కుటుంబాలు ఎక్కువగా ఉండగా...గత నాలుగైదేళ్లుగా పరిహారం కోసం అధికారులను కలుస్తూనే ఉన్నామని..వారెవరూ తమ ఇంటికి రాలేదని బాధితులు 'ఈనాడు'కు వెల్లడించారు. కొన్ని చోట్ల ఆయా గ్రామాల సర్పంచులకు ఫోన్ చేసి విచారించినట్లు, మరికొన్ని చోట్ల ఎవరిని కలవకుండానే దరఖాస్తులను తిరస్కరించినట్లు ఆర్ఎస్‌వీ సభ్యుల సర్వేల్లో వెల్లడైంది. నాంపల్లి మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన శంకర్ (29) పంటలు సరిగ్గా పండక రూ.5 లక్షల అప్పులపాలై 2018 మార్చి 9న బలవన్మరణానికి పాల్పడ్డాడు. క్షేత్రస్థాయిలో విచారణ చేసిన ఎస్సై, తహసీల్దార్, వ్యవసాయ అధికారి (ముగ్గురు సభ్యుల అధికార బృందం) ఇది రైతు ఆత్మహత్యేనని ధ్రువీకరిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం రాలేదు. శంకర్ భార్య అరుణతో పాటూ ఆమె ఇద్దరు పిల్లల వేదశ్రీ (12), అవంతిక (9) దిక్కులేనివారయ్యారు. కుటుంబ పోషణ కోసం అరుణ నిత్యం కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పెద్దవూర మండలం ఘనపూర్‌కు చెందిన గుండ్ల మల్లయ్య (36) అప్పులబాధతో 2018 నవంబరు 1న ఆత్మహత్య చేసుకున్నాడు. మండల స్థాయిలో అధికారులు రైతు ఆత్మహత్యగా ధ్రువీకరిస్తూ నివేదిక పంపారు. పరిహారం అందలేదు. దీంతో వీరి తరఫున స్వచ్ఛంద సంస్థ రైతు స్వరాజ్య వేదిక (ఆర్ఎస్‌వీ) కోర్టును ఆదేశించగా... పునర్విచారణ చేయాలని నల్గొండ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. క్షేత్రస్థాయి విచారణ చేయకుండానే ఇది రైతు ఆత్మహత్య కాదని అధికారులు తేల్చారు. దీంతో మల్లయ్య భార్య వెంకటమ్మ, ఆమె కూతురు మౌనిక ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

బాధితులకు పరిహారం అందించాలి

ఆరేళ్లు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు పరిహారం దక్కలేదు. దీనిపై త్వరలోనే కలెక్టరును కలిసి విన్నవించనున్నాం. గతంలోనూ పలుమార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. బాధితులు దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం వారికి కొంత ఆసరా అయ్యే అవకాశం ఉంది. కొండల్‌రెడ్డి, రైతు స్వరాజ్య వేదిక (ఆర్ఎస్‌వీ) రాష్ట్ర ప్రతినిధి

## వేగంగా సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులు

హైదరాబాద్: ప్రపంచ స్థాయి సౌకర్యాల కల్పన, ఆధునికత మేళవింపుతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ఈపీసీ (ఇంజినీరింగ్, సేకరణ, నిర్మాణం) విధానంలో మెసర్స్ గిర్ధారిలాల్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. సుమారు రూ.720 కోట్ల వ్యయంతో 36 నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రస్తుత స్టేషన్ భవనానికి రెండు వైపులా పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే టికెట్ బుకింగ్ కేంద్రాన్ని స్టేషన్‌కు ముందు నిర్మించారు. కొత్త ఆర్పీఎఫ్ భవనం పనులు పూర్తయ్యాయి. దక్షిణం వైపు భవనాలకు సంబంధించి పునాదుల నిర్మాణం 80 శాతం పూర్తయ్యింది. బేస్‌మెంట్ 1 స్లాబ్ పనులు 80 శాతం, బేస్‌మెంట్ 2 స్లాబ్ పనులు 60 శాతం జరిగాయి. దక్షిణం వైపు నిర్మిస్తున్న స్టేషన్ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రయాణికులను దించేసి వెంటనే వెళ్లేందుకు వీలుగా డ్రాప్–ఆఫ్ జోన్‌గా ఉండగా.. బేస్‌మెంట్ 1 దక్షిణం వైపు తిరుగు ప్రయాణంలో వచ్చే ప్రయాణికుల కోసం పికప్ జోన్‌గా ఉంటుంది. ద.మ. రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఈ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా పునరాభివృద్ధి పనులు జరగాలని అధికారులకు సూచించారు.

6 అంతస్తుల పార్కింగ్‌దక్షిణం వైపు ప్రయాణికులు రాకపోకలు సాగించే వీలుగా నిర్మిస్తున్న దారులతో పాటు.. అక్కడ బేస్‌మెంట్ 2లో దాదాపు 200 కార్లు నిలిపేందుకు వీలుగా పనులు జరుగుతున్నాయి. స్టేషన్ అవసరాలు తీర్చడానికి ప్రస్తుతం ఉన్న 11కేవీ విద్యుత్ స్టేషన్ స్థానంలో 33 కేవీ విద్యుత్ కెపాసిటీ గల రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు రానున్నాయి. ఇందులో భాగంగా దక్షిణం వైపున ఒక 33 కేవీ ఈఎస్ఎస్‌కు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. ఉత్తరం వైపున 6 అంతస్తుల మల్టీ–లెవల్ కార్ పార్కింగ్(ఎం.ఎల్.సీ.పీ) నిర్మాణ పునాది పనులు 50 శాతం పైగా జరిగాయి. కాలమ్స్‌తో పాటు గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ పనులు కూడా పూర్తయ్యాయి.

# సేంద్రియం మాయం.. ఎవుసం భారం

వికారాబాద్ : రెండు దశాబ్దాల కిందట ఇంటింటికీ పాడి గేదెలు, ఆవులు, కాడెద్దులుండేవి. దుక్కి దన్నడం మొదలు విత్తనాలు వేసే వరకు కాడెద్దులే దిక్కు. ప్రస్తుతం ట్రాక్టర్లు, ఇతర యంత్రాల రాకతో 90 శాతం రైతులు ఎద్దులు లేకుండానే వ్యవసాయం చేస్తున్నారు. కొందరి దగ్గరే పశువులున్నాయి. పోషణ భారం కావడంతో గ్రామాల్లో బాగా తగ్గిపోయాయి. పెంటకుప్పలు మాయమయ్యాయి. దీంతో అన్నదాతలు కోడి పెంట ఎరువువైపు దృష్టి సారించారు. పత్తి, కంది, మొక్కజొన్న, పసుపులో అధిక దిగుబడులు సాధించడానికి దాన్నే ఎక్కువగా వినియోగిస్తున్నారు. వికారాబాద్ ప్రాంతంలో కోళ్ల ఫారాలు తక్కువగా ఉండటంతో కోడి పెంట ఎరువుల ధరలు పెరుగుతున్నాయి. గతేడాది లారీ ఎరువు ధర రూ.25 వేలు ఉండగా.. ఈసారి రూ.28 వేలకు ఎగబాకింది. రానున్న వానాకాలం సాగుకు ఇప్పట్నుంచే దృష్టి సారిస్తున్నారు. దుక్కిదున్ని దిగుమతి చేసుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు.

పక్క జిల్లాల నుంచి దిగుమతి..

వికారాబాద్ జిల్లాకు చెందిన రైతులు రాజధాని నగరం చుట్టూ వ్యాపించి ఉన్న కోళ్లఫారాల నుంచి కోడి ఎరువులను దిగుమతి చేసుకుంటున్నారు. వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల రైతులు రాజధాని నగరంతోపాటు మెదక్ జిల్లాలోని నర్సాపూర్, రామాయంపేట, సంగారెడ్డి జిల్లాల్లో ఉన్న కోళ్లఫారాల



నుంచి కొంటున్నారు. వచ్చే సీజన్‌లో అధిక దిగుబడులు సాధించాలన్న ఆశతో కొంటున్నట్లు రైతులు చెబుతున్నారు.

జిల్లాలో సాగుభూమి: 5.84 లక్షల ఎకరాలు

తెల్లజాతి పశువులు: 1,74,847

నల్లజాతి పశువులు: 81,655

ప్రభుత్వం రాయితీపై సరఫరా చేయాలి..- రాములు, పుల్‌మద్ది, వికారాబాద్పశువులు తగ్గిపోవడంతో ఎరువులకు కొరత ఏర్పడింది. ప్రత్యామ్నాయ ంగా కోడి పెంట ఎరువును దిగుమతి చేసుకుంటున్నాం. పత్తి, మొక్కజొన్న, కంది, పసుపు, ఇతర కూరగాయల పంటల అధిక దిగుబడులకు తోడ్పడుతుంది. ప్రస్తుతం ఒక లారీ కోడి ఎరువుకు రూ.28 వేలదాకా ఖర్చు చేస్తున్నాం. ప్రభుత్వమే రాయితీపై సరఫరా చేస్తే బాగుంటుంది.

# గుత్తేదారులు చేతులెత్తేశారు!

హైదరాబాద్ : నాగమయ్యకుంట దిగువన ఉన్న పద్మకాలనీలో మూడేళ్లవుతున్నా నాలా విస్తరణ పూర్తవట్లేదు. అంబర్‌పేట సీపీఎల్ మీదుగా వెళ్లాల్సిన నాలా పనులూ మధ్యలోనే ఆగాయి. చంచల్‌గూడలో ఉక్కు వంతెన పనులు నిలిచాయి. భూసేకరణ జరగకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.రేటర్‌లో చేపట్టిన పనులు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. నిధుల కొరత ప్రధాన సమస్య కాగా.. ఏదో రూపేణా భూసేకరణను పూర్తి చేయాల్సిన అధికారులూ చేతులెత్తేశారు. దీంతో పనులు అసంపూర్తిగా మిగిలాయి. నాలాల పునరుద్ధరణ జరగట్లేదు. పైవంతెనల నిర్మాణం అర్థాంతరంగా నిలిచింది. కాలనీ రోడ్ల పనులకు శంకుస్థాపన కూడా జరగట్లేదు. చిన్న చిన్న నిర్వహణ పనులదీ అధ్వానమైన పరిస్థితి. మధ్యలో ఆగిన పనులతో జనం తీవ్ర అవస్థ పడుతుంటే.. జీహెచ్ఎంసీ ఏమాత్రం పట్టించుకోవట్లేదు. కనీసం.. ఆయా పనులకు నిధులను సమకూర్చడంపై, భూసేకరణను పూర్తి చేయడంపై ఏడాదిగా సమీక్ష చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.గచ్చిబౌలి ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వైపు చేపట్టిన శిల్పా లేఅవుట్ రెండోస్థాయి పైవంతెన నిర్మాణం మూడేళ్ల క్రితం మొదలైంది. పనులు సగం మేర పూర్తయ్యాయి. భూసేకరణకు నిధులు అవసరమనే కారణంతో అధికారులు అంతటితో పనులను ఆపేశారు.




గుంతలు తవ్విన రోడ్డుపై రాకపోకలు సాగించలేక వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారు.

బుల్కాపూర్ వరద నాలా విస్తరణ ఆదిలోనే నిలిచిపోయింది. మిలటరీ ప్రాంతంలో చేపట్టిన పనులకు డిజైన్లు మార్చాల్సి రావడంతో పనులు ఆగాయి. అహ్మద్‌నగర్ మీదుగా చింతలబస్తీ వరకు ఉన్న నాలాలో ఆక్రమణలు వెలిశాయి. జేసీబీ యంత్రం నాలాలోకి దిగేందుకు కూడా స్థలం లేదు. ఈ నేపథ్యంలో నిర్మాణాలను తొలగించుకుంటూ.. కల్వర్టులను నిర్మించాలని ఇంజినీర్లు ప్రతిపాదించగా.. భూసేకరణ ముందుకు పడట్లేదు.హుస్సేన్‌సాగర్ వరద నాలా విస్తరణ పనులదీ అదే పరిస్థితి. ఈ పనులు గత రెండు దశాబ్దాలుగా నానుతున్నాయి. హిమయత్‌నగర్, ఫీవర్ ఆస్పత్రి తర్వాత వచ్చే కాలనీల మధ్య భూసేకరణ సమస్య వల్ల నిలిచిపోయాయి.

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నగరవ్యాప్తంగా సుమారు రూ.200 కోట్లతో కాలనీల్లో అభివృద్ధి పనులకు జీహెచ్ఎంసీ టెండర్లు ఖరారు చేసింది. పనులు దక్కించుకున్న గుత్తేదారుల్లో.. పది శాతం మంది కూడా శంకుస్థాపన చేయలేదు. ఏడాదిగా రూ.1,500 కోట్ల బిల్లులు పెండింగులో ఉండటంతో ముందుకు రావడం లేదు.

# బడుల్లో ఎన్నికల నగారా




సిరిసిల్ల : సర్కారు బడుల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల నిర్వహణలో భాగస్వామ్యం చేసేందుకు ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేసింది. ప్రతి రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో బడుల బలోపేతానికి కృషి చేస్తోంది. కొవిడ్ కారణంగా నాలుగేళ్లుగా కొత్తగా విద్యా కమిటీలను ఎన్నుకోలేదు. ఆరు నెలలకోసారి పదవీ కాలం పొడిగిస్తూ వచ్చారు. ఎట్టకేలకు పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికకు నగారా మోగింది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి 631 ఉన్నాయి. వాటిలో 68,422 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీలకు 2019 డిసెంబర్‌లో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత కొవిడ్ ప్రభావంతో అవే కమిటీలను పొడిగిస్తూ వచ్చారు. చాలా విషయాల్లో కమిటీల భాగస్వామ్యం కొరవడి పాఠశాలల్లో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. పాఠశాలల్లో నిర్వహించే సమావేశాలకు సైతం ఆశించిన మేర తల్లిదండ్రులు రావడం లేదు. ఇటీవల సర్కారు నిర్ణయంతో జిల్లాలోని సాధారణ పాఠశాలలతోపాటు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ, జనరల్ గురుకులాలు, ఎయిడెడ్ పాఠశాలల్లో కొత్తగా పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి.

పాఠశాలల నోటీసు బోర్డులపై...ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రారంభించారు. పాఠశాలల నోటీస్ బోర్డులపై ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన అతికించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సైతం సమాచారం చేరవేస్తున్నారు. ఈ ఎన్నికల్లో 1 నుంచి 8 తరగతులకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులనే ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యులుగా ఎన్నుకుంటారు. ఈ నెల 20న నోటిఫికేషన్ జారీ, అదే రోజు తల్లిదండ్రుల జాబితాను నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తారు. 22న తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలు, 24న తుది జాబితా విడుదల, 29న ఎన్నికలు జరిపి అదే రోజు పాఠశాల యాజమాన్య కమిటీ తొలి సమావేశం నిర్వహిస్తారు. ఒక్కో తరగతికి ముగ్గురు తల్లిదండ్రుల చొప్పున గరిష్ఠంగా ప్రాథమిక పాఠశాలల్లో 15, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 21, ఉన్నత పాఠశాలల్లో 9 మంది వరకు సభ్యులను ఎన్నుకుంటారు. సభ్యులు నేరుగా ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. లేని పక్షంలో మూజువాణి ఓటు, రహస్య ఓటింగ్ నిర్వహిస్తారు. కమిటీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ప్రధానోపాధ్యాయుడితోపాటు మరో ఉపాధ్యాయుడు, గ్రామాల్లో వార్డు సభ్యులు, (పట్టణాల్లో కౌన్సిలర్), అంగన్‌వాడీ ఉపాధ్యాయిని, ఏఎన్ఎం, మహిళా సమాఖ్య సభ్యురాలు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు (విద్యావేత్తలు, ఎన్‌జీవో), ముగ్గురు తల్లిదండ్రులు కమిటీలో ఉంటారు.

కమిటీతో ప్రయోజనం...

మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించడం, పిల్లల హాజరు, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీలో వీరి పాత్ర కీలకంగా ఉంటుంది. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, నిధుల వినియోగంలో కమిటీ సభ్యులు కీలకం కానున్నారు.

నేడు నోటిఫికేషన్ విడుదలప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తాం. ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రశాంతంగా ప్రక్రియను పూర్తి చేస్తాం. ఇప్పటికే అన్ని పాఠశాలలకు సమాచారం అందించాం. నేడు నోటిఫికేషన్ విడుదల చేసి తల్లిదండ్రుల వివరాలు నోటీస్ బోర్డుపై అతికిస్తాం. 29న కొత్తగా ఎన్నికైన సభ్యులతో తొలి సమావేశం ఉంటుంది. ఇలా తల్లిదండ్రులను పాఠశాల నిర్వహణలో భాగస్వామ్యం చేయడంతో పిల్లలకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించడానికి వీలవుతుంది.రమేశ్‌కుమార్, జిల్లా విద్యాధికారి

# పనులు పూర్తి.. ప్రారంభానికి సిద్ధం



సిరిసిల్ల : జిల్లాలో మహిళలకు ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయి. వ్యవసాయం తర్వాత బీడీలు చుట్టడంపైనే మహిళల జీవనాధారం. వస్త్ర పరిశ్రమలోనూ తరచూ ఆటుపోట్లు ఎదురవడంతో దానిపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి కరవవుతోంది. వీటన్నింటికీ ప్రత్యామ్నాయంగా సిరిసిల్ల పట్టణం పెద్దూరులో 64 ఎకరాల్లో అపరెల్ పార్కును ఏర్పాటు చేశారు. ఇక్కడ పరిశ్రమల స్థాపన పెరిగిన కొద్దీ ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయి. ప్రస్తుతం ఈ పార్కులో రెండో యూనిట్ పనులు చివరి దశకు చేరాయి. ఏడు ఎకరాల విస్తీర్ణంలో రూ.44 కోట్ల వ్యయంతో టీఎస్ఐఐసీ ప్లగ్ అండ్ ప్లే తరహాలో వసతులు సమకూర్చింది. ఇందులో బెంగళూరుకు చెందిన జౌళి పారిశ్రామిక సంస్థ టెక్స్‌ఫోర్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ (టీఐపీఎల్) తమ ఉత్పత్తులను ప్రారంభించనుంది. 2022 ఫిబ్రవరిలోనే అప్పటి ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆయా శాఖలతో సమీక్షించి పరిశ్రమ ఏర్పాటుపై సమీక్షించాల్సిన ఆవశ్యకత ఉంది.

నైపుణ్య శిక్షణ

అపరెల్ పార్కులో పూర్తిగా దుస్తుల తయారీ పరిశ్రమల స్థాపనకే అవకాశాలున్నాయి. వీటిలో పని చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు వేర్వేరుగా ఉపకార వేతనాలతో ఉచిత శిక్షణ అందిస్తున్నాయి. అయిదేళ్లలో 3,150 మంది మహిళలు శిక్షణను పూర్తి చేసుకున్నారు. వీరిలో ఇప్పటికే ప్రారంభమైన గ్రీన్‌నిడిల్ అనే కంపెనీలో 800 మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. రెండో కంపెనీలో 2 వేల మందికి అవకాశాలు ఉండనున్నాయి. ఈ కంపెనీ ప్రారంభానికి ప్రాథమికంగా శిక్షణ పొందిన వారికి తమ సంస్థలో ఉత్పత్తి చేయబోయే అపరెల్ ఉత్పత్తులకు అనుగుణంగా మరోసారి శిక్షణనిస్తారు. నైపుణ్యాల కొరత ఉండటంతో సమీప జిల్లాలో ఆసక్తి ఉన్న మహిళలకు సైతం ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు.

వస్త్ర పరిశ్రమలో మార్పు అవసరం

జిల్లా వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తి అవుతున్న వస్త్రం పూర్తిగా ముతకరకం. ఇక్కడ ఎగుమతి రకాల వస్త్రోత్పత్తులు ఉత్పత్తి కావు. అపరెల్ పరిశ్రమలోని ఉత్పత్తులకు అనుగుణంగా పరిశ్రమలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. స్థానిక అవసరాలతోపాటు వస్త్రోత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడతాయి. తొలి పరిశ్రమ గ్రీన్‌నిడిల్ సంస్థ పూర్తిగా లోదుస్తులు, నిట్‌వేర్ క్రీడలకు వినియోగించే దుస్తులను తయారు చేస్తున్నారు. దీనికి అవసరమైన ముడి సరకును చైనా, బెంగళూరుల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రెండో యూనిట్ ఎక్కువగా కాటన్ నూలుతో తయారు చేసే దుస్తుల ఉత్పత్తికి అవకాశాలున్నాయి. విదేశీయులను ఆకట్టుకునేలా డైయింగ్, ప్రింటింగ్ కూడా ఉంటాయి. జిల్లాలోని టెక్స్‌టైల్ పార్కు, సిరిసిల్ల పట్టణంలోని మరమగ్గాలు అపరెల్ ఉత్పత్తులకు తగిన నూలుతో వస్త్రాన్ని ఇక్కడే తయారు చేస్తే ఇక్కడ పరిశ్రమలు స్థాపించిన వారికి రవాణా భారం తగ్గడంతోపాటు పరిశ్రమలో ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి.

నెల రోజుల్లో ఎంపికరెండో కంపెనీలో జూకీ మిషన్లను త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల కంపెనీ ప్రతినిధులు వచ్చి పనులను పరిశీలించి వెళ్లారు. మా వద్ద శిక్షణ పూర్తి చేసుకున్న వారి వివరాలు కూడా తెలుసుకొన్నారు. నెల రోజుల్లో ఎంపిక ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. తొలుత 500 మందిని ఎంపిక చేస్తారు. వారి కంపెనీ ఉత్పత్తులకు అనుగుణంగా శిక్షణనిచ్చి అందులో అర్హత సాధించిన వారిని విధుల్లోకి తీసుకుంటారు. కంపెనీకి ఆర్డర్లు పెరిగే కొద్దీ ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. జూకీ శిక్షణ కావాలని ఇప్పటి వరకు 12 వేల మంది నమోదు చేసుకున్నారు. విడతల వారీగా శిక్షణ ఇస్తాం.జనార్దన్, జూకీ ఇన్‌స్ట్రక్టర్, చేనేత, జౌళిశాఖ

# రూ.40లక్షలు దాటలేదట!

కరీంనగర్ : శాసనసభ ఎన్నికల సమరం హోరాహోరీగా సాగింది.. ప్రధాన పార్టీల అభ్యర్థులు అన్ని అస్త్రాలతో ప్రచార రంగంలోకి దూసుకెళ్లారు.. ఇంటింటి ప్రచారాలు.. ఆత్మీయ సమ్మేళనాలు.. అధినేతల సభలతో ప్రచారాన్ని హోరెత్తించారు.. ఫలితాల వెల్లడి తరువాత ఎన్నికల అధికారులకు అభ్యర్థులు అందించిన వ్యయ వివరాల్ని పరిశీలిస్తే మాత్రం ఎవరివీ రూ.40 లక్షల గరిష్ఠ పరిమితి దాటకపోవడం గమనార్హం.ప్రలోభాలపై పలు ఆరోపణలుశాసనసభ ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభ పెట్టడానికి అభ్యర్థులు పలు మార్గాలు అవలంబించారన్న ప్రచారం జరిగింది. పోలీసుల తనిఖీల్లోనూ రూ.కోట్లు నగదు, రూ.లక్షల విలువైన మద్యం పట్టుబడింది. రోజూ వెంట తిరిగే కార్యకర్తలకు ఉదయం నుంచి రాత్రి వరకు అల్పాహారం, భోజన ఖర్చులు.. కార్యకర్తలు లేని అభ్యర్థులైతే కూలీలను వెంట తిప్పుకొంటూ రోజుకు రూ.200ల నుంచి రూ.500ల వరకు చెల్లించారు. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో విందు భోజనాలు, ప్రధాన పార్టీల అభ్యర్థులు నిర్వహించిన ముఖ్య నేతల సభలకైతే జనం తరలింపు.. ఏర్పాట్లకు పెద్ద మొత్తంలో వెచ్చించారు. దీంతోపాటు పోలింగ్‌కు ముందు రోజు కొందరు అభ్యర్థులు ఓటుకు రూ.500 నుంచి రూ.2వేల వరకు పంచారన్న ఆరోపణలు వచ్చాయి. పార్టీల నాయకులే డబ్బుల పంపిణీపై పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. ఎన్నికల సమయంలో ఖర్చు విపరీతంగా కనిపించినా.. చివరకు అధికారులకు చూపిన లెక్కల్లో మాత్రం గరిష్ఠ పరిమితి దాటలేదు.

# బంగారు భవితకు బాటలు

వికారాబాద్ : నిరుపేద అల్ప సంఖ్యాకుల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో గురుకులాలు ఏర్పాటు చేసింది. వికారాబాద్, తాండూరులో బాలురు, బాలికలకు.. పరిగి, కొడంగల్‌లో కేవలం బాలురకు ఉన్నాయి. వాటిలో ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం, ఉత్తమ బోధన అందిస్తున్నారు. విద్యార్థులకు రంగాల్లో తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

ప్రవేశాలు ప్రారంభం..

జిల్లాలోని ఆరు అల్ప సంఖ్యాక గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 2024- 2025 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంతోపాటు 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సందేహాలు, సలహాలకు ఆయా గురుకుల విద్యాలయం ప్రిన్సిపాళ్లను చరవాణుల్లో సంప్రదించవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఈనెల 18 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఫిబ్రవరి 6 వరకు అవకాశం కల్పించారు. ఈ విద్యాలయాల్లో ప్రవేశానికి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎంఆర్



ఈఐఎస్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలోని ఆయా గురుకులాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.పేద పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి..- సుధారాణి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి, వికారాబాద్

పేద విద్యార్థులకు ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన బోధన అందిస్తున్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయి.

దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్- రాత్లావత్ పకీరా, ప్రిన్సిపల్, మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, వికారాబాద్

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అల్ప సంఖ్యాకుల గురుకుల బాలుర పాఠశాల, కళాశాలల్లో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేశాం. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. వివరాలకు 9959746436 నంబరులో సంప్రదించాలి.

# కొత్తవి.. ఉత్తిమాటే!

తాండూరు : జిల్లాలో వాణిజ్య, వ్యాపార కేంద్రంగా పేరున్న తాండూరు పట్టణ పరిసరాల్లో మెరుగైన విద్యుత్తు సరఫరా చేయడానికి అదనంగా నిర్మించాల్సిన ఉపకేంద్రాల పనులు ముందుకు సాగడం లేదు. ఎన్నికలకు ముందు ఒకచోట పనులు ప్రారంభమయ్యాయి. మరో మూడు చోట్ల అతీగతీ లేదు. ఉపకేంద్రాల నిర్మాణం పూర్తయితే మిగతా వాటిపై ఒత్తిడి తగ్గుతుంది. వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు సరఫరా అవుతుంది.

2023లో రూ.10.22 కోట్లు మంజూరు..

తాండూరు నియోజకవర్గంలోని జిన్‌గుర్తి, చంద్రవంచ, జుంటుపల్లి, కందనెల్లిలో ఒక్కో ఉపకేంద్రం నిర్మాణానికి కలిపి 2023లో అప్పటి భారాస ప్రభుత్వం రూ.10.22 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణాలకు అవసరమైన స్థలాలనూ అధికారులు గుర్తించారు. అంతా సవ్యంగా సాగడంతో అదే ఏడాది సెప్టెంబరులో శంకుస్థాపన చేశారు. ఒకచోట పనులు ప్రారంభం కాగా.. మిగిలిన మూడు చోట్ల స్పష్టత కరవైంది. ప్రస్తుతానికి అధికారులు అటువైపు దృష్టి సారించడం లేదు.

భారం తగ్గించాలని..

తాండూరు నియోజకవర్గంలో మొత్తం 24 విద్యుత్తు ఉపకేంద్రాలున్నాయి. వాటి నుంచి 70వేల గృహాలు, 13వేలు వ్యవసాయం, 1,200 చిన్న, పెద్ద పరిశ్రమలకు విద్యుత్తు సరఫరా అవుతోంది. పెద్దేముల్ మండలం కందనెల్లికి తాండూరులోని 220 కేవీ వికారాబాద్ ఫీడర్ నుంచి విద్యుత్తు సరఫరా అవుతోంది. అలాగే యాలాల మండలం జుంటుపల్లికి దౌలాపూరు ఉపకేంద్రం నుంచి, తాండూరు మండలం జిన్‌గుర్తి, చంద్రవంచకు కరణ్‌కోట ఉపకేంద్రం నుంచి విద్యుత్తు వస్తోంది. కరణ్‌కోట, దౌలాపూరు, వికారాబాద్ ఫీడర్‌పై తాండూరులోని పరిశ్రమలు, గృహాలకు సంబంధించిన సర్వీసులు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై ఒత్తిడి తగ్గించి గృహాలు, పరిశ్రమలు, వాణిజ్య, వ్యాపారాలకు మెరుగైన విద్యుత్తు సరఫరా చేయడానికి ప్రత్యేకంగా జిన్‌గుర్తి, చంద్రవంచ, జుంటుపల్లి, కందనెల్లిలో ఉపకేంద్రాలు నిర్మించడానికి టెండర్లనూ పూర్తి చేశారు. జిన్‌గుర్తిలో పనులు మందకొడిగా సాగుతున్నాయి. మిగిలిన మూడుచోట్ల అసలే ప్రారంభం కాలేదు.

స్థలాలు స్వాధీనం చేయకపోవడంతోనే..- ఆదినారాయణ, విద్యుత్తు ఏడీఈ, తాండూరు

జుంటుపల్లి, చంద్రవంచ, కందనెల్లిలో ఉపకేంద్రాలను నిర్మించడానికి అవసరమైన స్థలాలను రెవెన్యూశాఖ మాకు స్వాధీనం చేయాల్సి ఉంది. స్థలాలు లేక పోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఈ వ్యవహారం ఉన్నత స్థాయి అధికారుల పరిధిలో ఉంది.

# మరో పదేళ్లలో నగరంలో హెలీ టాక్సీ సేవలు!

హైదరాబాద్: విశ్వనగరంలో హెలీటాక్సీ సర్వీసుల ఏర్పాటుపై అనేక సంస్థలు దృష్టి సారించాయి. మరో పదేళ్లలో నగరంలో వేర్వేరు ప్రాంతాల నుంచి ఈ హెలీటాక్సీ సేవలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని 'జెట్‌సెట్‌గో' సంస్థ ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. నగరంలో హెలీ సర్వీసులు ప్రారంభిస్తే.. నగర ముఖచిత్రం ఎలా ఉంటుందో చూపుతూ ఓ నమూనాను 'వింగ్స్ ఇండియా 2024' ఎగ్జిబిషన్ స్టాళ్లలో ప్రదర్శిస్తున్నారు. ఇక్కడ ప్రస్తుతం 9 వరకు హెలిప్యాడ్‌లు ఉండగా రానున్న కాలంలో 50కి మించి ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ఆసుపత్రులతో పాటు వాణిజ్య భవనాలపైనా హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేసుకునే రోజులు రాబోతున్నాయని తెలిపారు.సాంకేతిక అంశాలపై దృష్టి.. కోటికి పైగా జనాభా ఉన్న నగరంలో ఏటా వాహనాల సంఖ్య పెరుగుతోంది. ట్రాఫిక్ అంతకంతకూ పెరుగుతున్న తరుణంలో అత్యవసర వైద్య చికిత్సలకు ఎయిర్ అంబులెన్స్‌లతో పాటు ప్రయాణాలకు హెలీటాక్సీల అవసరం పెరుగుతుందని 'జెట్‌సెట్‌గో' సంస్థ 'ప్రాజెక్టు స్ట్రాటజీ మేనేజర్' రేయాజ్ హైదర్ తెలిపారు. ఈ క్రమంలోనే ఎలక్ట్రిక్ పవర్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్, హైబ్రీడ్ ఎలక్ట్రిక్ పవర్ షార్ట్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్, హైబ్రీడ్ ఎలక్ట్రిక్ పవర్ వర్టికల్ షార్ట్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ వంటి సాంకేతిక అంశాలపై పలు సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇది విజయవంతమైతే శివారు ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు, నగరంలోని ఆసుపత్రులకు, ఇతర ప్రాంతాలకు ఈ హెలీసర్వీసులు అందుబాటులోకి రానున్నాయని వివరించారు.

# డిజిటల్ బోధన.. ఉత్తమ ఫలితాలకు ఆస్కారం

వీర్నపల్లి : ఊడి పడే శిథిలాలు... సరిపోని శౌచాలయాలు... ఇరుకుగా గదులు... చీకట్లోనే బోధన.. ఇదీ! ఒకప్పటి సర్కారు బడుల దుస్థితి. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లోని బడుల్లో వసతులు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. సాంకేతికత జోడించి డిజిటల్ పద్ధతిలో వినూత్న విధానం ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచి అమలు కానుంది. దీనికి సంబంధించిన ఉపకరణాలు ఇప్పటికే పాఠశాలల్లో అమర్చగా కార్పొరేట్‌ను తలదన్నేలా బోధన జరగనుంది. జిల్లాలోని 510 ప్రభుత్వ పాఠశాలలు, 13 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, 7 ఆదర్శ పాఠశాలలు, 19 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. సుమారు 50 వేల మంది విద్యార్థులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులకు గుణాత్మక విలువలతో కూడిన విద్య అందించేందుకు జిల్లా అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే మన ఊరు- మన బడి మొదటి విడతలో భాగంగా 172 పాఠశాలల్లో 12 అంశాలకు సంబంధించిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు. అయితే ఈ ఏడాది దృశ్య బోధన పద్ధతిలో పాఠాలు బోధించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఒక్కో పాఠశాలకు మూడు చొప్పున 123 తాకే తెర ఉన్న టీవీలను 41 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు పంపిణీ చేశారు. ఒక్కో టీవీ, దానికి సంబంధించిన ఉపకరణాలు, బోర్డుల విలువ సుమారు రూ. 3 లక్షల వరకు ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పటికీ ఇన్వర్టర్ల సాయంతో బోధన కొనసాగేలా ఏర్పాటు చేశారు. టి-ఫైబర్ ద్వారా అంతర్జాల సేవలను అందించనున్నారు. ఇవీ ఉపయోగాలు...

విద్యార్థులు తరగతి గదిలో ఎక్కడి నుంచైనా చూసేందుకు 75 ఇంచుల వెడల్పుతో టీవీలు ఉంటాయి. తెలంగాణ స్టేట్ టెక్నోలాజికల్ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) సాయంతో ఐఎఫ్‌ఎస్ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ స్క్రీన్) టీవీల ద్వారా సాధారణ బోధన, అంతర్జాలాన్ని ఉపయోగించి ఉపాధ్యాయులు పాఠాలు చెబుతుంటారు.

టీవీలను తెల్లని బోర్డులుగా ఉపయోగిస్తూ పెన్నులు, చేతి వేళ్లతో నచ్చిన రంగుల్లో అక్షరాలు రాయవచ్చు. చెప్పిన పాఠాలను రికార్డు చేసి ఎప్పుడైనా వీక్షించేందుకు వీలుగా ఉంటాయి. పాఠ్య పుస్తకాల పీడీఎఫ్ డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు చూపిస్తూ చెప్పే అవకాశం ఉంది. పాఠ్యాంశాలకు సంబంధించిన దృశ్యమాలికలను చూపిస్తూ సులభమైన పద్ధతిలో 8, 9, 10 విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించవచ్చని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. టెలివిజన్‌కు రక్షణగా పైన అమర్చిన గ్రీన్ బోర్డు సుద్ద ముక్కలతో మాములుగా పాఠాలు చెప్పేందుకు వినియోగించవచ్చు. తెర మాదిరిగా ఉన్న బోర్డును పక్కకు జరిపితే టీవీ కనిపిస్తుంది.

**ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ**

జిల్లాలోని 41 పాఠశాలలకు 123 టీవీలను పంపిణీ చేశాం. 8, 9, 10 తరగతి విద్యార్థులకు ఒక్కొక్కటి చొప్పున ఇచ్చాం. ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చాం. కరెంటు సరఫరా నిలిచిపోయినా టెలివిజన్‌లు పని చేసేటట్లు ఇన్వర్టర్‌లు అమర్చుతున్నాం. డిజిటల్ పద్ధతిలో పాఠాలు చెప్పడంతో విద్యార్థులకు తొందరగా అర్థమవుతుంది. విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతాయి. రమేశ్ కుమార్, జిల్లా విద్యాధికారి

**సులువుగా అర్థమవుతుంది**

టీవీల్లో ఉపాధ్యాయులు పాఠాలు చెబుతుంటే కొత్త అనుభూతి కలుగుతుంది. వీడియోలు, తెల్ల బోర్డుపై రాస్తే ఆసక్తిగా పాఠాలు వింటున్నాం. సులువుగా పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటున్నాం. క్రమం తప్పకుండా బడికి రావాలనిపిస్తుంది. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను మించిన ఫలితాలు సాధిస్తాం.
శ్రీహర్ష, 10వ తరగతి విద్యార్థిని, వీర్నపల్లి

**ఇంకా చెప్పాలనిపిస్తుంది**

ప్రభుత్వం పాఠశాలలకు అత్యాధునాతన సౌకర్యాలు కల్పిస్తుంది. మౌలిక వసతులు చేకూరుతున్నాయి. ఇటీవల పంపిణీ చేసిన పెద్ద టీవీలతో విద్యార్థులకు పాఠాలు బోధించడం ఆసక్తిగా అనిపిస్తుంది. సాంకేతికతను వినియోగించుకుంటూ ఇంకా కొత్త విషయాలు చెప్పాలనిపిస్తుంది. టీవీల్లో దృశ్యమాలికలు, అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు అంతర్జాల కనెక్షన్లు ఇస్తామని చెప్పారు. అలాగే ఇన్వర్టర్‌లను సమకూర్చారు. సాంకేతికతను వినియోగించుకుంటూ మంచి ఫలితాలతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతాం. రవి, ప్రధానోపాధ్యాయుడు, వీర్నపల్లి

# రోగులకు వరం.. డయాలసిస్ కేంద్రం

వేములవాడ : డయాలసిస్ రోగుల కష్టాలు తీరనున్నాయి. వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో దాదాపు రూ. 80 లక్షలతో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. దీప్ చంద్ డయాలసిస్ సెంటర్ (డీసీడీసీ) సంస్థచే ప్రభుత్వం ఒప్పందం చేసుకుని దీనిని ఏర్పాటు చేసింది. ఆసుపత్రిలోని ఓ వార్డులో అయిదు పడకలతో అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేశారు. నెఫ్రాలజీ వైద్యులతో సమన్వయం చేసుకుంటూ రోగులకు సేవలు అందించను న్నారు. మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకు ఆధునిక వైద్య



సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకు ఈ ప్రాంతానికి చెందిన రోగులు సిరిసిల్ల ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్తున్నారు. ప్రస్తుతం వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో అధునాతన సౌకర్యాలతో కేంద్రాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. త్వరలోనే ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకు రానున్నారు. వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు పలుమార్లు కలెక్టర్ అనురాగ్ జయంతి క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు కూడా త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. దీంతో పనుల్లో వేగం పెరిగింది. ఈ కేంద్రంలో ఆరోగ్య శ్రీ ద్వారా చేరిన రోగులకు అత్యవసర మందులతో పాటు ఆరు రకాల మందులు ఉచితంగా అందజేస్తారు. రోగులకు సేవలు అందించేందుకు ముగ్గురు టెక్నీషియన్లు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, కంప్యూటర్ ఆపరేటర్లు, వైద్య సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఇప్పటికే వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది దాదాపు 40 మంది పైగా డయాలసిస్ రోగులను గుర్తించి వివరాలు సేకరించా రు. వారందరికీ ఇందులో ఉచితంగా సేవలు అందించనున్నారు.

# బల్దియాలో కార్యకలాపాలు సాగేనా?



కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయం ప్రజలు, కార్పొరేటర్లతో నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి చోట కొన్ని రోజులుగా కార్యకలాపాలు స్తంభించాయి. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ బల్దియాకు వస్తున్నారని తెలిసి, 12 రోజులుగా కార్యాలయం లోపల, బయట ఆధునికీకరణ పనులు చేశారు. ఈనెల 21న మంత్రితో ప్రారంభోత్సవాలు చేయగా..ఆ సమయంలో కొంతమేర పనులు పూర్తి చేసి మిగతావి పెండింగ్‌లోనే ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ పనుల నిమిత్తం ప్రజల రాకపోకలు ఎక్కువ య్యాయి. అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉన్న విభాగాలు అస్తవ్యస్తంగా ఉండటంతో అవస్థలు పడుతున్నారు.

**విధులు, సేవలకు అంతరాయం**

కార్యాలయంలోని పలు విభాగాల్లో ఉద్యోగులు విధుల నిర్వహణకు నానావస్థ పడుతున్నారు. కొన్ని గదులలో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో చీకటిగా ఉండటం, కంప్యూటర్లు పని చేయకపోవడం, అంతర్జాలం రాకపోవడంతో ఏం పనులు చేయాలో తెలియక సతమతమవుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో విద్యుత్తు కనెక్షన్ ఇవ్వకపోవడం, దుమ్ము, ధూళితో నిండి ఉండటం, రంగులు వేయకపోవడంతో వీరంతా సుడా కార్యాలయంలో అత్యవసర పనులు చేసుకుంటున్నారు. పాత మెప్మా గదిలో చీకటిగా ఉండటంతో జిల్లా కార్యాలయానికి, ఇతర విభాగాల్లో ఉండి పనులు చేస్తున్నారు. ఆడిట్ విభాగానికి అయితే గది లేకుండా పోయింది. వారంతా ఏటూ కాకుండా తిరుగుతున్నారు. రెండో అంతస్తులో రికార్డు గది చీకటిగా ఉండగా గత్యంతరం లేక ప్రజల నుంచి వచ్చిన సహచట్టం దరఖాస్తులకు దస్త్రాలు వెతికే పనుల్లో ఉద్యోగులు నిమగ్నమయ్యారు. ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు, అధికారులు స్మార్ట్‌సిటీ కార్యాలయంలో, రిజర్వాయర్ల దగ్గర కూర్చోని విధులు నిర్వర్తిస్తున్నారు.

**బేజారవుతున్న ప్రజలు**

నగర పాలక కార్యాలయంలో రోజుల తరబడి పనులు జరుగుతుండటం, ఏ విభాగం ఎక్కడ ఉంది? అధికారులు, ఉద్యోగులు ఎక్కడ ఉన్నారో? తెలియక కార్యాలయానికి వచ్చిన ప్రజలు బేజారవుతున్నారు. పలు రకాల అనుమతులు, ఫిర్యాదులు, వ్యక్తిగత సమస్యలు తెలుసుకోవడానికి వచ్చిన వారంతా బల్దియా మొత్తం తిరుగుతున్నారు. అయినా కావాల్సిన విభాగం కనిపించకపోవడంతో వెనక్కి వెళ్తున్నట్లుగా చెబుతున్నారు. అత్యవసర విభాగాలకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మేయర్ వై.సునీల్‌రావు తెలిపారు. మిగతా విభాగాల్లో, లోపల, బయట కొంతమేర ఉన్న పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. కొత్తగా కార్యాలయంలో గ్రంథాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. అన్ని అంతస్తుల్లో సీసీ కెమెరాలు బిగించి కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేస్తామన్నారు.

**పూర్తి కాని పనులు**

ఆధునికీకరణ పనులు పూర్తి కాకపోవడంతో కార్యాలయ పనులపై ప్రభావం పడుతోంది. కొత్త భవనంలో మెప్మా, పారిశుద్ధ్య విభాగం పనులు ఇప్పటికీ చేపడుతున్నారు. పాత కార్యాలయం వైపు లోపలి భాగంలో విద్యుత్తు, టైల్స్ పనులు చేయాల్సి ఉండగా, బయట కూడా చుట్టూ టైల్స్, గార్డెనింగ్ పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఆగమేఘాల మీద పనులు చేయగా వాటిని పూర్తి స్థాయిలో చేయాల్సి ఉంది. కొత్త భవనంలో కూడా ఫర్నీచర్ సమకూర్చాల్సి ఉంది. రెవెన్యూ విభాగంలో బిల్ కలెక్టర్లు కూర్చోవడానికి వీలుగా లేకపోవడంతో వారంతా దిక్కులు చూస్తున్నారు. కార్యాలయం పైభాగంలో ప్రతి రోజు జాతీయ జెండా ఎగురవేసేందుకు గద్దె నిర్మించాల్సి ఉంది.

కొత్త భవనంలో అసౌకర్యాలుకొత్తగా నిర్మించిన భవనంలో పౌరసేవల కేంద్రం, రెవెన్యూ, జనన, మరణాల విభాగం, పింఛన్లు, నీటి కుళాయిల విభాగం, పన్నుల విభాగాలు ఉండగా అందులో సరైన స్థాయిలో సౌకర్యాలు లేక వచ్చిన ప్రజలు, ఉద్యోగులకు సమస్యలు తప్పడం లేదు. ఫ్యాన్లు ఉన్నా ఉక్కబోత భరించలేక పోతున్నారు. మూత్రశాలలకు నీటి సౌకర్యం కల్పించలేదు. తాగునీటి కూలర్ బిగించలేదు. రోజుల తరబడి పనులు కొనసాగించకుండా రాత్రింబవళ్లు పనులు పూర్తి చేయించి యథావిధిగా కార్యకలాపాలు కొనసాగేలా చూడాలని పాలకవర్గ సభ్యులు కోరుతున్నారు.

# ఒప్పంద దశలోనే పనులు




సిరిసిల్ల : గంగాధర నుంచి వేములవాడ రహదారిలో బోయినపల్లి సమీపంలో గంజివాగుపై లోలెవల్ వంతెన శిథిలమైంది. వర్షాలకు ఈ వంతెనపై నుంచి వరద ప్రవహిస్తుంది. వాహనదారులు చూసుకోకుండా ప్రయాణించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా మట్టితో కప్పినా వర్షాలకు తిరిగి యథాస్థితికి చేరుతుంది. రూ. 5 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణానికి రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపినా నిధులకు మోక్షం లేదు. సిరిసిల్ల-కోనరావుపేట ప్రధాన రహదారిపై కొండాపూర్-వెంకట్రావుపేటలో పెంటివాగు ఉంది. వర్షాలకు ఈ కాజ్‌వేపై నుంచి వరద ప్రవాహం మూలవాగులో కలుస్తుంది. మూలవాగులో వరద ఉద్ధృతి ఎక్కువైతే కాజ్‌వేపై ప్రవాహం తగ్గదు. రెండేళ్లలో రెండు సార్లు ఈ కాజ్‌వే కొట్టుకుపోయింది. తాత్కాలికంగా పైపులు వేసి మట్టితో చదును చేశారు. ఏటా వర్షాకాలం రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై హైలెవల్ వంతెనల నిర్మాణానికి రూ. 5 కోట్లతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. సిద్దిపేట నుంచి కామారెడ్డి వెళ్లే ప్రధాన రహదారి గంభీరావుపేట మండలం లింగన్నపేట వద్ద లోలెవల్ కాజ్‌వే వానాకాలం ప్రమాదకరంగా మారుతుంది. వర్షం కురిస్తే చాలు ఎగువమానేరు నిండి దానిపై నుంచి వచ్చే వరద మానేరులోకి చేరుతుంది. కాజ్‌వేపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయి. వాహనాలను గంభీరావుపేట మీదుగా మళ్లిస్తుంటారు. రెండేళ్ల క్రితం హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ. 17 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికీ రెండు సార్లు టెండర్లు పిలిచినా ఒక్కరూ ముందుకు రాలేదు. దీంతో ఈ ఏడాది కూడా రాకపోకలకు ఇబ్బందులు తప్పేలా లేవు. వర్షాకాలం వస్తే వాగులపై రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. జిల్లాలో ప్రధానంగా మానేరు, మూలవాగులు ప్రవహిస్తున్నాయి. గత రెండేళ్లలో కురిసిన భారీ వర్షాలతో వీటిపై నుంచి వరద ప్రవహించడంతో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. వరదలు పూర్తిగా తగ్గే వరకు ఆ వైపు వెళ్లడం లేదు. అప్పటి వరకు సమీప గ్రామాల మీదుగా తిరిగి వెళ్తున్నారు. ఈ రెండు వాగులపై ఎనిమిది చోట్ల హైలెవల్ వంతెనల నిర్మాణానికి రూ. 85 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వీటిలో వేములవాడ - సిరోంచ రహదారితోపాటు వట్టెంలలో శాత్రాజుపల్లి వద్ద రెండు, మానేరుపై గంభీరావుపేట మండలం లింగన్నపేట వద్ద హైలెవల్ వంతెనల నిర్మాణాలకు రూ. 23.73 కోట్లు మంజూరయ్యాయి. రెండ్రోజుల క్రితం హన్మాజీపేట వద్ద నక్కవాగుపై వంతెన నిర్మాణానికి రూ. 11.55 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిధులు మంజూరైనా టెండర్లు, పనులు ఒప్పంద దశలోనే ఉన్నాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకే ఇంకా సమయం పట్టేలా ఉంది. ఈ వానాకాలం కూడా వాగులపై ప్రయాణ తిప్పలు తప్పేలా లేవు.

జిల్లాలో మానేరు, మూలవాగులు ఒక్కో చోట 200 నుంచి 150 మీటర్ల వెడల్పుతో ఉన్నాయి. ప్రభుత్వం తొలుత 50 మీటర్ల లోపు ఉన్న వంతెనలకు మాత్రమే నిధులు మంజూరు చేసింది. వేములవాడ నియోజకవర్గంలో కోనరావుపేట, చందుర్తి, వేములవాడ మండలాల్లో చాలా గ్రామాలను కలుపుతూ మూలవాగు ప్రవహిస్తుంది. మామిడిపల్లి-నిజామాబాద్, వట్టిమల్ల-నిమ్మపల్లి, బావుసాయిపేట-వెంకట్రావుపల్లి, హన్మాజిపేట-బావుసాయిపేట, మర్రిగడ్డ-సనుగుల, వేములవాడ-కోరుట్ల రహదారిలో, వెంకట్రావుపల్లి-మల్లాపూర్ గ్రామాల మధ్య వర్షాకాలం ఇబ్బందులు తప్పవు. గంగాధర నుంచి వేములవాడకు రావాలంటే మధ్యలో బోయినపల్లి వద్ద గంజివాగు అడ్డుగా మారింది. ఆయా ప్రాంతాల్లో వంతెనల నిర్మాణాలకు రూ. 55 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. ఇటు సిరిసిల్ల నియోజకవర్గంలో మానేరు వాగుతో ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లోని గ్రామాలకు అదే పరిస్థితి నెలకొంది.

ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లికి చెందిన వారు సిరిసిల్లకు రావాలంటే ఎల్లారెడ్డిపేట మండలం పదిరలోని మానేరువాగు దాటాలి. ఎగువమానేరు అలుగు పారినన్ని రోజులు వాగు ప్రవహిస్తూనే ఉంటుంది. ఈ గ్రామానికి రాకపోకలకు ఇబ్బందులు తప్పవు. అత్యవసరమైతే ఆవునూరు, వెంకటాపూర్ మీదుగా పది కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇక్కడున్న లోలెవల్ వంతెన పంచాయతీరాజ్ పరిధిలో ఉంది. దీనిని రెండేళ్ల క్రితం ఆర్‌అండ్‌బీకి అప్పగించారు. శాఖలు మారడటంతో వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేయడంలో జాప్యం జరుగుతోంది.

**ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలి**

ఈ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదలతో ఇబ్బందులు పడే గ్రామాలను ముందుగా గుర్తించాలి. రవాణాకు ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులు దృష్టి సారించాలి. ప్రధానంగా వరదలు వచ్చే ప్రాంతాల్లో హెచ్చరిక సూచికలు, రేడియం స్టిక్కర్లు అంటించాలి. ప్రమాదకర కల్వర్టులు, లోలెవల్ వంతెన వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలి. అత్యవసర వైద్య సేవలకు వెళ్లే 108 వాహనాల డ్రైవర్లకు ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన కల్పించాలి.

**పనులు ప్రారంభించేలా చూస్తాం**

మూడు చోట్ల వంతెన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. లింగన్నపేట వంతెన నిర్మాణానికి రెండు సార్లు టెండర్లు పిలిచినా స్పందన లేదు. రెండు చోట్ల టెండర్లు పూర్తయిన వాటికి గుత్తేదారులతో ఒప్పందం చేసుకుని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. మిగతా ప్రతిపాదనలకు విడతల వారీగా నిధులు మంజూరవుతాయి. శ్యాంసుందర్, ఈఈ, ఆర్‌అండ్‌బీ

# సంఘాల వ్యాపారం.. లాభాల సహకారం

పెద్దపల్లి : ఒకరి కోసం అందరు.. అందరి కోసం ఒకరు.. అన్న స్ఫూర్తితో ఏర్పడిన సహకార సంఘాలు వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి బాటలు వేస్తున్నాయి. అయితే సభ్యులకు రుణాల పంపిణీ, వసూళ్లు.. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణతోనే సరిపెట్టుకోకుండా కొన్ని సంఘాలు వ్యాపారాలపై దృష్టి పెడుతున్నాయి. పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు, కిరాణం, విత్తన విక్రయ కేంద్రాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలు, తాగునీటి శుద్ధి కేంద్రాలు వంటి వ్యాపారాలతో ఆదాయం సముపార్జిస్తున్నాయి.. రెండు దశాబ్దాల కిందట రూ.వేల టర్నోవర్‌తో మొదలైన ప్రాథమిక సహకార సంఘాలు(ప్యాక్స్‌లు) నేడు రూ.కోట్ల టర్నోవర్ సాధించే స్థాయికి చేరుకుంటున్నాయి.. ఇతర సంఘాలూ వీటిని ఆదర్శంగా తీసుకుని లాభాలు గడిస్తే మరింత బలోపేతమవుతాయి..

**ఆదాయ సముపార్జనలో ఆదర్శం**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో దాదాపు 3,300 మంది సభ్యులున్నారు. రూ. 40 కోట్ల వార్షిక టర్నోవర్ ఉండగా వ్యవసాయ అవసరాలకు రూ. 6.20 కోట్ల రుణాలు ఇచ్చారు. రూ. 54 లక్షల వార్షిక విక్రయ టర్నోవర్‌తో సూపర్ మార్కెట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. రూర్బన్ పథకం కింద రూ. 54 లక్షలతో అధునాతన విత్తన శుద్ధీకరణ ప్లాంటును ఏర్పాటు చేశారు. రూ. 50 లక్షలకు పైగా వెచ్చించి 'సహకార' పేరిట నీటి



సీసాల తయారీ, శుద్ధి ప్లాంటు ఏర్పాటు చేసి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సరఫరా చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 'ప్యాక్స్ పోతుగల్ డాట్‌కాం' పేరిట సొంత వెబ్ పోర్టల్‌ను కలిగి ఉంది. 2016లో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ సంఘం దేశంలోనే తొలి వెబ్‌పోర్టల్ కలిగిన పీఏసీఎస్‌గా ఖ్యాతి కెక్కింది. 100 శాతం రుణ వసూళ్లు సాధించి వరుసగా మూడు సార్లు ఉత్తమ సొసైటీగా ప్రభుత్వం నుంచి అవార్డు సాధించింది. 2,112 మంది రైతులు సభ్యులుగా ఉన్న ఈ సంఘాన్ని 2018లో శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌లు సందర్శించారు. 50 వేల మందికి రుణాలు ఇవ్వగా 100 శాతం రికవరీతో రికార్డు సృష్టించింది. 100 శాతం నగదు రహిత లావాదేవీలతో సభ్యులకు ఆర్థిక, వాహన, గృహ, విద్య, వైద్య, ఇతర రుణాలు అందిస్తోంది. 2023 నాటికి రూ. 15.21 కోట్ల మూలధన నిల్వలతో లాభాల బాటలో నడుస్తూనే రైతులకు అండగా ఉంటోంది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి సహకార సంఘం రూ. 25 లక్షలతో తొలి పెట్రోల్ బంకును ఏర్పాటు చేసింది. మండలంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ బంకు ద్వారా నెలకు రూ. 3 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. జగిత్యాల జిల్లా రాయికల్ సహకార సంఘం 4,060 మంది సభ్యులు, రూ. 1.20 కోట్ల మూలధనంతో ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ధాన్యం కొనుగోళ్లు, పెట్రోల్ బంకు నిర్వహణ, ఎరువులు, విత్తనాల వ్యాపారం నిర్వహిస్తూ రూ. లక్షల్లో నికర లాభాలు గడిస్తోంది. బంగారు, వాహన రుణాలు, వాహన బీమా, చమురు ఉత్పత్తుల అమ్మకం వంటి వ్యాపారాలను నిర్వహిస్తోంది. పెట్రోలు, డీజిల్ అమ్మకాల ద్వారా సంవత్సరంలో గరిష్ఠంగా రూ. 30 లక్షల వరకు లాభాలు వస్తున్నాయి.

**జిల్లా ప్రాథమిక సహకార సంఘాలు**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| కరీంనగర్ | 28 | జగిత్యాల | 51 | రాజన్న సిరిసిల్ల | 26 | పెద్దపల్లి | 20 |

# వెలువడని నోటిఫికేషన్

జగిత్యాల : ఓ వైపు ముందస్తుగా పంటలను పండించాలని ప్రభుత్వం పేర్కొంటున్నా రుతుపవనాలరాక ఆలస్యం కావటం పంటలసాగుపై ప్రభావం చూపుతోంది. ఇదే తరుణంలోనే పంటల బీమా అమలుకు ఈ సీజన్‌లోనూ ఇప్పటివరకు ప్రభుత్వం నోటిఫికేషన్‌ను వెలువరించనందున బీమా అమలు సందిగ్ధంగా మారింది. బీమా కిస్తీ చెల్లింపు రైతుల ఐచ్ఛికం కాగా ప్రభుత్వం ఉత్తర్వులిస్తేనే కంపెనీల ద్వారా బీమా అమలుకు అవకాశం ఉంటుంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా తెలంగాణలోనే అత్యధిక సంఖ్యలో జగిత్యాల జిల్లాలో 12 పంటలకు బీమా ఉండేది. కాగా నోటిఫికేషన్ వెలువరించి రైతుల నుంచి ప్రీమియం తీసుకునేవారు. ఇందులో వరికి గ్రామం యూనిట్‌గా, మక్క, కంది, పెసర, మినుము, సోయా, పసుపు, వేరుసెనగ, నువ్వు పంటలకు మండలం యూనిట్‌గా బీమాను వర్తింపచేస్తారు. జిల్లాలో వాతావరణ ఆధారిత బీమా పరిధిలో వానాకాలం మిరప, పత్తి, యాసంగిలో మామిడి పంటలున్నాయి. బ్యాంకుల నుంచి రైతులు పంటరుణం తీసుకునే సమయంలో నేరుగా వానాకాలం 2 నుంచి 5 శాతం ప్రీమియం, యాసంగిలో 1.5 నుంచి 5 శాతం ప్రీమియంను బ్యాంకర్లు మినహాయించి బీమా కంపెనీకి చెల్లించాలి. రైతులు చెల్లించిన కిస్తీ మొత్తంతో సమానంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మిగిలిన సగం ప్రీమియంను రైతు రాయితీగా కంపెనీకి చెల్లించాలి. కానీ కిస్తీ చెల్లింపును రైతుల ఇష్టానుసారం చేయగా బ్యాంకులు కిస్తీ మొత్తాన్ని తీసుకోవటంలేదు. ఆసక్తి ఉన్న రైతులే తమ జిల్లాలో పంటల బీమా అమలుచేసే కంపెనీకి తమవంతు కిస్తీని చెల్లిస్తే ఇంతేమొత్తంలో ప్రభుత్వం కిస్తీని కంపెనీకి చెల్లిస్తుంది. ఇది నోటిషికేషన్ వెలువడిన తరువాతనే సాధ్యపడుతుంది. కానీ ఏప్రిల్, మే మాసాల్లో వెలువడాల్సిన బీమా అమలు ఉత్తర్వులు ఇప్పటికీ రానందున అమలుపై సందిగ్ధం నెలకొంది. సాలీనా జిల్లాలో వడగళ్లు, వరదలు, బెట్ట, ఈదురు గాలులు తదితర ప్రకృతి విపత్తులతో రూ. 200 కోట్లకుపైగా విలువైన పంటలను రైతులు నష్టపోతుండగా బీమాను అమలుచేస్తేనే పరిహారం వచ్చి రైతులకు ఆసరాగా ఉంటుంది. ఈ నేపథ్యంలో బీమా నోటిఫికేషన్‌ను వెలువరించటంతో పాటుగా యూనిఫైడ్ ప్యాకేజీ పథకాన్ని అమలు చేయాలి. యూనిఫైడ్ ప్యాకేజీ వల్ల పంటలబీమా చేసిన రైతు ప్రమాదవశాత్తు మరణించిన సందర్భాల్లో రైతు కుటుంబానికి రూ. 2 లక్షల పరిహారం, అంగవైకల్యం పొందినా రూ. 2 లక్షల పరిహారం, పాక్షిక వైకల్యానికి రూ. లక్ష పరిహారం ఇస్తారు. కుటుంబపెద్ద మరణించినపుడు చదువుతున్న పిల్లలకు ఆర్థికసాయం, ఇళ్లు నష్టపోయినా, ట్రాక్టరు, పంపుసెట్‌కు నష్టం వాటిల్లినా బీమా పరిహారాన్ని చెల్లించాలి. జిల్లాలో వానాకాలంలో 4.43, యాసంగిలో 3.45 లక్షల ఎకరాల్లో అన్నిరకాల పంటలు సాగవుతాయి కాబట్టి తమకు లబ్ధి కలిగేలా కమతం వారీగా పంటల బీమాను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.




గువాహటి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో జరుగుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్రను అస్సాం పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు గువాహటి నగరంలోకి ప్రవేశించకుండా సరిహద్దుల వద్ద బారికేడ్లను ఏర్పాటుచేశారు. అయినప్పటికీ దూసుకురావడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. సోమవారం మధ్యాహ్నం తర్వాత రాహుల్ యాత్ర అస్సాం నుంచి నాగాలాండ్‌లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. తిరిగి మంగళవారం ఉదయం ఇరు రాష్ట్రాల సరిహద్దుకు చేరుకున్న రాహుల్.. స్థానిక యువతతో సంభాషించారు. అక్కడి నుంచి గువాహటి నగరానికి బయల్దేరారు. అయితే, కాంగ్రెస్ పార్టీ తమ యాత్ర మార్గాన్ని మార్చుకోవాలని అంతకుముందు అస్సాం ప్రభుత్వం ఆదేశించింది. ట్రాఫిక్ కారణాల దృష్ట్యా గువాహటిలో యాత్రకు అనుమతించడం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఉదయం వెల్లడించారు. నగర బైపాస్ మీదుగా వెళ్లాలని సూచించారు. కానీ, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గువాహటి చేరుకున్నారు. దీంతో వారిని అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బారికేడ్లను దాటుకుని కార్యకర్తలు దూసుకొస్తుండగా పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ అక్కడే ఉన్నారు. ఈ ఉద్రిక్తతలపై రాహుల్ మాట్లాడుతూ.. "ఇదే మార్గంలో బజ్‌రంగ్ దళ్ యాత్ర చేపట్టింది. భాజపా చీఫ్ నడ్డాజీ ర్యాలీ నిర్వహించారు. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు రాలేదు. ఇప్పుడు మాత్రం మాకు బారికేడ్లు పెట్టారు. మేం వాటిని మాత్రమే దాటాం. చట్టాన్ని అతిక్రమించలేదు" అని అన్నారు. కాగా.. సోమవారం కూడా రాహుల్ యాత్ర సందర్భంగా అస్సాంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ప్రముఖ వైష్ణవ సాధువు శ్రీమంత్ శంకర్‌దేవ జన్మస్థలి బతద్రవ సత్రను దర్శించుకోకుండా రాహుల్‌ను అడ్డుకున్నారు. దీనిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, మేఘాలయలో యూనివర్సిటీ విద్యార్థులతో రాహుల్ ఇష్టాగోష్ఠికి స్థానిక అధికారులు అనుమతులు ఇవ్వలేదు.

## మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు అంబులెన్స్ ఇవ్వరా?: చంద్రబాబు



అమరావతి: విజయనగరం జిల్లాలో వరుస మరణాలపై తెదేపా అధినేత చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. శృంగవరపుకోట మండలం చిట్టంపాడులో గంగమ్మ, ఆమె 6 నెలల కొడుకు మరణించి 15 రోజులు కాకముందే అదే గ్రామంలో ఏడాదిన్నర వయసున్న మరో చిన్నారి ప్రవీణ్ చనిపోయాడన్న వార్త మనసును కలచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు 'ఎక్స్' (గతంలో ట్విటర్)లో పోస్టు చేశారు. అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లడానికి చిన్నారిని 7 కిలోమీటర్లు మోసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్ ఇవ్వరా? అని వైకాపా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెత్తందారు ముఖ్యమంత్రికి పేదల గోడు పట్టదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అయినా దీనిపై స్పందించి.. అడవి బిడ్డల మరణ ఘోషపై సమీక్ష చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 'అనారోగ్యంతో మరో మరణం' పేరిట 'ఈనాడు'లో వచ్చిన కథనాన్ని ఆయన షేర్ చేశారు.

## వైసీపీ ప్రభుత్వ పాలసీలపై రఘురామ పిల్.. విచారణ 12కు వాయిదా..



అమరావతి: వైసీపీ ప్రభుత్వ పాలసీలపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ ఎంపీ రఘురామ కృష్ణరాజు ఏపీ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణను ఏపీ హైకోర్టు ఫిబ్రవరి 12కి వాయిదా వేసింది. ఈలోపు వ్యాజ్యం విచారణ అర్హతపై కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రతివాదులకు వెసులుబాటు కలిగింది. కౌంటర్లపై రిప్లై వేయాలని పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. పిల్ విచారణార్హతపై ఫిబ్రవరి 12న వాదనలు వింటామని స్పష్టం చేసింది. వ్యాజ్యం విచారణ అర్హతపై ముఖ్యమంత్రి జగన్ కౌంటర్ దాఖలు చేయనున్నారు.

## ఏపీపీఎస్సీ గ్రూప్ -1 పరీక్ష దరఖాస్తుల గడువు పొడిగింపు

అమరావతి: ఏపీలో గ్రూప్- 1 ఉద్యోగాలకు దరఖాస్తుల గడువును ఏపీపీఎస్సీ పొడిగించింది. రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో మొత్తం 81 గ్రూప్- 1 పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఈనెల 21తో ముగిసిన విషయం తెలిసిందే. అయితే, గ్రూప్-1 ఆశావహుల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు దరఖాస్తుల గడువును పొడిగించాలని APPSC నిర్ణయించింది. అర్హులైన అభ్యర్థులు జనవరి 28వ తేదీ అర్ధరాత్రి వరకు ఆన్‌లైన్ https://psc.ap.gov.in/లో దరఖాస్తు చేసుకోవచ్చని ఓ ప్రకటనలో పేర్కొంది. మరోసారి ఈ గడువును పొడిగించబోమని స్పష్టంచేసింది. ప్రిలిమినరీ పరీక్ష మార్చి 17న జరుగుతుందని.. ఇందులో ఎలాంటి మార్పు లేదని స్పష్టంచేసింది.







## సీఎం జగన్, ఎమ్మెల్యే మోసం చేశారంటూ.. వినూత్న నిరసన

నరసాపురం: సీఎం జగన్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్యకర్తలతో కలిసి చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. మాధవనాయుడు మాట్లాడుతూ... నరసాపురం ప్రజలను ఎమ్మెల్యే మూడు సార్లు మోసగించారన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ పదవికోసం జిల్లా కేంద్రాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. నరసాపురం నుంచి భీమవరానికి జిల్లా కేంద్రం, మెడికల్ కాలేజీ తరలించారని ఆరోపించారు. రూ.3,200 కోట్లతో అభివృద్ధి పనులు అంటూ ప్రజలను దగా చేశారని ధ్వజమెత్తారు. 14 నెలలు గడిచినా బటన్ నొక్కిన పనులు ప్రారంభం కాలేదని, సీఎం జగన్, ఎమ్మెల్యే మోసం చేశారని ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.

## సామాన్యులతో కలిసి ఆర్టీసీ బస్సులో ఏపీసీసీ చీఫ్ షర్మిల ప్రయాణం..

శ్రీకాకుళం, జనవరి 23: ఏపీలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ముందుకు సాగుతున్నారు. నేటి నుంచి జిల్లాల పర్యటనకు షర్మిల శ్రీకారం చుట్టారు. ఈరోజు నుంచి తొమ్మిది రోజుల పాటు రాష్ట్రంలోని జిల్లాల్లో పీసీసీ చీఫ్ పర్యటించనున్నారు. ఇచ్ఛాపురం నుంచి ఇడుపులపాయ వరకు పర్యటన సాగనుంది. తొలిరోజు ఇచ్ఛాపురంలో పర్యటన ప్రారంభంకావాల్సి ఉండగా.. అక్కడకు వెళ్లేందుకు షర్మిల ఆర్టీసీ బస్సును ఎంచుకున్నారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా పలాస వద్ద షర్మిల ఆర్టీసీ బస్ ఎక్కారు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు బస్సులో ప్రయాణం చేశారు. బస్సులో ప్రయాణికులతో ఏపీసీసీ చీఫ్ ముఖాముఖి నిర్వహించారు. షర్మిలతో పాటు మాణిక్యం ఠాగూర్, గిడుగు రుద్రరాజు, రఘువీరా రెడ్డి బస్సులో ప్రయాణించారు.




నరసరావుపేట: వైకాపాకు మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు ఎంపీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం మీడియాతో మాట్లాడారు. కొంతకాలంగా పార్టీలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వైకాపాలో కొంత అనిశ్చితి ఏర్పడిందని.. దానికి తాను బాధ్యుడిని కాదని శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలతో కార్యకర్తలు కొంత అయోమయానికి గురవుతున్నారని, దానికి తెరదించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నరసరావుపేట లోక్‌సభ స్థానంలో కొత్త అభ్యర్థిని నిలబెట్టాలని పార్టీ ఆలోచిస్తోందన్నారు. నాలుగున్నరేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేశానని చెప్పారు. కొద్దిరోజుల క్రితం సీఎం జగన్‌తో లావు శ్రీకృష్ణదేవరాయలు భేటీ అయ్యారు. ఆ తర్వాత ఆయన ఓ ఛానల్‌తో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నా అభిప్రాయాలతో సీఎం కన్విన్స్ అయ్యారని అనుకోవడం లేదు. గుంటూరు నుంచి పోటీ చేయాలనే సీఎం ప్రతిపాదనను నేను అంగీకరించలేదు. సీఎం బిజీగా ఉన్నందున మళ్లీ ఇప్పట్లో కలిసే పరిస్థితి లేదు' అని అప్పట్లో చెప్పారు. ఇప్పటికే వైకాపాకు చెందిన ఇద్దరు ఎంపీలు ఆ పార్టీకి రాజీనామా చేశారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్ బయటికొచ్చారు. బాలశౌరి ఇటీవలే జనసేనలో చేరారు. తాజాగా మరో ఎంపీ వైకాపాకు రాజీనామా చేయడం చర్చనీయాంశమవుతోంది.

## లావు శ్రీ కృష్ణ దేవరాయులు బాటలో మరికొంత మంది వైసీపీ కీలక నేతలు



గుంటూరు: ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయులు నేడు వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. లావు శ్రీ కృష్ణ దేవరాయులు బాటలోనే మరికొంత మంది పల్నాడు వైసీపీ కీలక నేతలు పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు పార్టీకి రాజీనామా చేయనున్నారట. అలాగే లావు శ్రీ కృష్ణ దేవరాయులు వెంట గుంటూరుకు చెందిన వైసీపీ ముస్లిం కీలక నేత ఒకరు.. పల్నాడు జిల్లాకి చెందిన ఓ ఎమ్మెల్యే, మరో ఎమ్మెల్సీ కూడా పార్టీ వీడతారని ప్రచారం జరుగుతోంది.




## అయోధ్యలో మరో చరిత్రాత్మక ఘట్టం.. సామాన్య భక్తులకు దర్శన భాగ్యం

అయోధ్య: అయోధ్య రామమందిర తలుపులు సామాన్య భక్తులకు తెరుచుకోవటంతో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. మంగళవారం ఉదయం నుంచి స్వామివారి దర్శన భాగ్యానికి సామాన్యులను అనుమతించారు. సోమవారం ఘనంగా జరిగిన ప్రాణప్రతిష్ఠ తర్వాత కేవలం అతిథులు మాత్రమే శ్రీరాముడిని దర్శించుకున్నారు. ఇక నుంచి సామాన్య భక్తులందరూ బాలరాముడిని దర్శించుకోవచ్చు. సామాన్యులను స్వామివారి దర్శనానికి మంగళవారం నుంచి అనుమతిస్తామని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ముందే ప్రకటించింది. దీంతో భక్తులు సోమవారం అర్ధరాత్రి నుంచే మందిరం వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ప్రభుత్వం ముందు జాగ్రత్తగా భారీ ఎత్తున బలగాలను మోహరించింది. దర్శనం, హారతి వేళల వివరాలను ట్రస్ట్ తమ వెబ్‌సైట్‌లో వెల్లడించింది. రాముడి దర్శనం చేసుకోవాలనుకునే భక్తులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు లాంటి ఏదో ఒక గుర్తింపు పత్రం తీసుకెళ్లాలి. హారతి కార్యక్రమానికి ఉచితంగానే పాస్ ఇస్తారు కానీ అవి పరిమితంగా ఉంటాయి. ఆన్‌లైన్‌లో కానీ, ప్రత్యక్షంగా ఆలయం వద్ద కానీ పాస్ తీసుకున్న వాళ్లకే ఆ సమయంలో అనుమతిస్తారు. పదేళ్లలోపు పిల్లలకు మాత్రమే మినహాయింపు ఉంది.

**దర్శన వేళలు :** ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు

**జాగరణ హారతి :** ఉదయం 6.30 గంటలకు (ఒక రోజు ముందుగానే అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది)

**సంధ్యా హారతి:** రాత్రి 7.30 గంటలకు (అందుబాటును బట్టి అదే రోజు బుక్ చేసుకునే సదుపాయం ఉంది)

**బాలరాముడి దర్శనం/హారతి పాస్‌లకు ఆన్‌లైన్ బుకింగ్ ఇలా..**

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లాలి. మీ మొబైల్ నంబరుతో సైన్ ఇన్ అయి ఓటీపీ ఎంటర్ చేస్తే మీ రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఒకసారి లాగిన్ అయిన తర్వాత.. 'మై ప్రొఫైల్' సెక్షన్‌లోకి వెళ్లి మీ గుర్తింపు వివరాలు, చిరునామా వంటివి నమోదు చేయాలి. ఆ తర్వాత హారతి/దర్శనం టైమ్ స్లాట్లను ఎంచుకుని.. పాస్ కోసం బుక్ చేసుకోవాలి. ఆలయ ప్రాంగణంలోకి వెళ్లిన తర్వాత కౌంటర్‌లో మీ పాస్‌లు తీసుకుని దర్శనానికి వెళ్లొచ్చు.

## జగన్‌ను ఇకపై అలానే పిలుస్తా: వైఎస్ షర్మిల



ఇచ్ఛాపురం: తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని చూపిస్తామంటూ వైకాపా సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి చేసిన సవాల్‌పై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. అభివృద్ధిని చూసేందుకు తాను సిద్ధమని.. తేదీ, సమయం చెప్పాలని ఛాలెంజ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు ఆమె ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ప్రయాణికులతో వివిధ అంశాలపై ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం బస్సులోనే మీడియాతో ఆమె మాట్లాడారు. సీఎంను తాను జగన్‌రెడ్డి అంటే సుబ్బారెడ్డికి నచ్చడం లేదన్నారు. ఇకపై ఆయన్ను అన్న గారు అనే అంటానని వ్యాఖ్యానించారు. "సుబ్బారెడ్డి గారూ.. మీ సవాల్‌ను స్వీకరిస్తున్నా. మీరు చేసిన అభివృద్ధిని చూపించండి. దానిని చూసేందుకు నేను సిద్ధం. తేదీ, సమయం మీరు చెప్పండి.. లేదంటే నేను చెబుతా. అభివృద్ధి పరిశీలనకు మేధావులను కూడా పిలుద్దాం. నాతో పాటు మీడియా, ప్రతిపక్షాలు కూడా వస్తాయి. చేసిన అభివృద్ధి ఏంటో అందరికీ చూపించండి. అభివృద్ధి ఎక్కడ? మీరు చెప్పిన రాజధానులు ఎక్కడ?కడతామన్న పోలవరం ప్రాజెక్టు ఎక్కడ?" అని షర్మిల నిలదీశారు.

**షర్మిలను కలిసిన బెంతొరియా ప్రతినిధులు :** తమను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ బెంతొరియా ప్రతినిధులు షర్మిలకు వినతిపత్రం అందజేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు మెళియాపుట్టిలో తమ సామాజిక వర్గం ఉందని తెలిపారు. కులం పరంగా ఎలాంటి గుర్తింపునకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చదువు, ఉద్యోగాలకు అర్హత పొందేలా సమగ్ర ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని.. వైకాపా ప్రభుత్వం గత ఏడాది జనవరి 30 నుంచి వాటిని నిలిపివేసిందని షర్మిల దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పునరుద్ధరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తమకు న్యాయం చేయాలని కోరారు.

## నారా లోకేష్‌కు పవన్ జన్మదిన శుభాకాంక్షలు

అమరావతి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పాదయాత్ర చేపట్టి ప్రజలతో మమేకం కావడంలో లోకేష్ తనదైన పంథాను అనుసరించారన్నారు.

ప్రజా సమస్యలు చూస్తూ, రాజకీయ ఒత్తిళ్లతో సామాన్యులు ఏ విధంగా ఇబ్బంది పడుతున్నారో స్వయంగా తెలుసుకున్నారన్నారు. లోకేష్‌కు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సంతోషాలను అందించాలని కోరుకుంటున్నట్టు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.



## సామ్ కలర్ఫుల్ గ్లామర్ ట్రీట్.. స్టన్నింగ్ లుక్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్ గా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. గత కొంతకాలంగా సినిమాలకు బ్రేక్ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో మాత్రం ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ అందాలతో కుర్రకారును ఆకట్టుకుంటుంది. ఆమధ్య ఓ మ్యాగజైన్ కవర్ పేజీ కోసం సమంత బోల్డ్ ఫోటోషూట్ ఏ రేంజ్ లో హాట్ టాపిక్ అయిందో తెలిసిందే. ఎప్పటికప్పుడు లేటెస్ట్ అవుట్ ఫిట్స్ లో దిగిన ఫోటోలను అభిమానులతో పంచుకునే సమంత తాజాగా ఓ డిఫరెంట్ అవుట్ ఫిట్ తో సోషల్ మీడియాలో దర్శనమిచ్చింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సమంత లేటెస్ట్ పిక్ నేటిజన్స్ ని విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఎల్లో అండ్ వైట్ కాంబినేషన్ లో ఉన్న అవుట్ ఫిట్ ధరించిన సామ్ తనదైన స్టైల్ లో ఫోజ్ ఇచ్చింది. ఇది చూసిన ఫ్యాన్స్, నెటిజన్స్ మరోసారి సమంత అందాన్ని పొగడ్తలతో



ముంచెత్తుతున్నారు. 'సమంత ఎలాంటి అవుట్ ఫిట్ వేసిన దానికే అందం వస్తుందదని, సామ్ లేటెస్ట్ పోజ్ లో మరింత క్యూట్ గా ఉందని' కామెంట్స్ చేస్తున్నారు. ఇక సమంత పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే.. కొన్నాళ్ల క్రితం సమంత మయోసైటీస్ అనే వ్యాధి బారిన పడింది. అందుకోసం ప్రత్యేకంగా ట్రీట్మెంట్ తీసుకుంది. ఈమధ్య కాస్త కోలుకుంది. అప్పటివరకు ఒప్పుకున్న సినిమాలను పూర్తి చేసిన తర్వాత కొంత గ్యాప్ తీసుకోవాలని నిర్ణయించుకున్న సమంత రీసెంట్ గా వెకేషన్ లో భాగంగా ప్రపంచంలో వివిధ ప్రదేశాలను సందర్శించింది. మరోవైపు వీలైనంత త్వరగా మళ్లీ సినిమాలకు రీ ఎంట్రీ ఇవ్వాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే సమంత ఇప్పటికే కొన్ని స్క్రిప్టులు వింటున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది సమంతకు సరైన సక్సెస్ దక్కలేదు. ఆమె నటించిన 'యశోద' పరవాలేదు అనిపించింది. కానీ 'శాకుంతలం', 'ఖుషి' వంటి సినిమాలు బాక్సాఫీస్ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయాయి. ఖుషి సినిమాతో తర్వాత సినిమాలకి బ్రేక్ తీసుకున్న సామ్ అంతకంటే ముందు చేసిన 'సిటాడెల్' వెబ్ సిరీస్ త్వరలోనే విడుదల కాబోతోంది. బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధవన్ ప్రధాన పాత్ర పోషించిన ఈ సిరీస్ ని ఫ్యామిలీ మాన్ వెబ్ సిరీస్ ని తెరకెక్కించిన రాజ్ అండ్ డీకే డైరెక్ట్ చేస్తున్నారు.

## 'యానిమల్' బ్యూటీ అందాల ఊచకోత

రణబీర్ కపూర్ హీరోగా వచ్చిన యానిమల్ సినిమాలో హీరోయిన్ గా నటించిన రష్మిక మందన్నా కంటే కూడా కీలక పాత్రలో నటించిన తృప్తి డిమ్రి కి మంచి మార్కులు పడ్డాయి అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సోషల్ మీడియాలో తృప్తి క్రేజ్ ఏంటో ఇప్పటికే పలు సందర్భాల్లో నిరూపితం అయ్యింది. యానిమల్ సినిమాకు ముందు పెద్దగా తెలియని తృప్తి డిమ్రి ఇప్పుడు పాన్ ఇండియా రేంజ్ లో ప్రేక్షకులకు సుపరిచితురాలు. అందుకే ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ మ్యాగజైన్స్ కవర్స్ పై కూడా అప్పుడే సందడి మొదలు పెట్టింది. తాజాగా హలో మ్యాగజైన్ కవర్ పై తృప్తి డిమ్రి మెరిసింది. హలో కవర్ పై ఈ అమ్మడి అందంకు ఎంతటి వారు అయినా కూడా ఫిదా అవ్వాల్సిందే అన్నట్లుగా ఉంది. వైట్ డ్రెస్ లో



క్లీ వేజ్ అందాల ఆరబోత చేస్తూ కవ్వించేలా చూస్తూ మతి పోగొడుతుంది. ఈ అందం ముందు ఎంతటి అందం అయినా కూడా దిగదుడుపే అన్నట్లుగా కూడా కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

సోషల్ మీడియాలో ఈ అమ్మడి అందాల ఊచకోత గురించి తెగ మాట్లాడుకుంటూ ఉన్నారు. యానిమల్ సినిమాలో ఆమె పాత్రకు వచ్చిన ప్రశంసలు అంతా ఇంతా కాదు. యానిమల్ సినిమా తర్వాత ఆమె కెరీర్ ఒక్కసారిగా యూ టర్న్ తీసుకుంది. ప్రస్తుతం ఆమె చేతి నిండా సినిమాలు ఉన్నాయని, రాబోయే కాలంలో కాబోయే స్టార్ హీరోయిన్ అంటూ తృప్తి డిమ్రి గురించి నెటిజన్స్ మాట్లాడుకుంటున్నారు.




## మెగా బాక్సాఫీస్.. ఆ 3 నెలలు బ్లాస్టే



మెగా హీరోల సినిమాలు థియేటర్స్ లోకి వస్తున్నాయంటే ఫ్యాన్స్ కి పూనకాలే. ముఖ్యంగా స్టార్ హీరోలైన మెగాస్టార్ చిరంజీవి, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, అల్లు అర్జున్ సినిమాలకి మెగా ఫ్యాన్స్ పెద్దపీట వేస్తారు. ఈ సినిమాలు రిలీజ్ అయ్యే సమయంలో హంగామా సృష్టిస్తారు. మెగా ఫ్యామిలీకి ఫ్యాన్స్ అతి పెద్ద బలం. అందుకే ప్రతి ఏడాది క్రమం తప్పకుండా సినిమాలు రిలీజ్ చేసే ప్రయత్నం మెగా హీరోలు చేస్తూనే ఉన్నారు. ఈ ఏడాదిలో కూడా మూడు నెలల వ్యవధిలో ముగ్గురు మెగా హీరోల సినిమాలు థియేటర్స్ లోకి వస్తున్నాయి. ఈ మూడు కూడా పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ కావడం విశేషమని చెప్పాలి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సుకుమార్ దర్శకత్వంలో చేస్తోన్న పుష్ప ది రూల్ మూవీ ఆగష్టు 15కి ప్రేక్షకుల ముందుకి తీసుకొని వస్తున్నారు. ఈ మూవీపై దేశ వ్యాప్తంగా హైప్ క్రియేట్ అయ్యి ఉంది. వెయ్యి కోట్ల కలెక్షన్స్ టార్గెట్ తో మూవీ థియేటర్స్ లోకి రానుంది. ఈ సినిమా తర్వాత సెప్టెంబర్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ శంకర్ దర్శకత్వంలో చేస్తోన్న గేమ్ చేంజర్ మూవీ రిలీజ్ కానుందని తెలుస్తోంది. క్లైమాక్స్ షూట్ కూడా శంకర్ కంప్లీట్ చేసినట్లు తెలుస్తోంది. దిల్ రాజు భారీ బడ్జెట్ తో ఈ సినిమాని నిర్మిస్తున్నారు. అలాగే శంకర్ ఫస్ట్ టైం తెలుగులో చేస్తోన్న సినిమా కావడంతో ఎక్స్ పెక్టేషన్స్ ఎక్కువగానే ఉన్నాయి. దీని తర్వాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సుజిత్ దర్శకత్వంలో మూవీ ఓజీ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమా షూటింగ్ 50 శాతం ఇప్పటికే కంప్లీట్ అయ్యింది. పవన్ కళ్యాణ్ ఎలక్షన్స్ హడావిడి అయ్యాక మళ్ళీ షూటింగ్ లో మొదలుపెట్టనున్నారు. ఈ సినిమాని అన్నిటికంటే ముందు తీసుకొచ్చే పనిలో ఉన్నారు. అందులో భాగంగా ముందుగా షూటింగ్ వేగంగా కంప్లీట్ అయితే జులైలో రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. ఒక వేళ షూటింగ్ ఆలస్యం అయితే మాత్రం అక్టోబర్ లో మాత్రం కచ్చితంగా రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. మోస్ట్ అవైటింగ్ మూవీగా ఈ సినిమా ఉంది. పవన్ కళ్యాణ్ కెరియర్ లో మొదటి పాన్ ఇండియా మూవీగా వస్తుండటంతో ఫ్యాన్స్ చాలా హోప్స్ పెట్టుకున్నారు. కచ్చితంగా ఈ సినిమా పవన్ ఇమేజ్ ని ఇండియా వైడ్ గా ఎస్టాబ్లిష్ చేస్తుందని భావిస్తున్నారు. ఇలా మెగా హీరోలు ముగ్గురు మూడు నెలల్లోనే తమ సినిమాలని రిలీజ్ చేస్తూ ఉండటంతో ఫ్యాన్స్ సందడికి ఇక హద్దే ఉండదు.

## బ్యూటీ భలే యోగాసనం



టాలీవుడ్ లోని యంగ్ హీరోల్లో దాదాపు అందరితో సినిమాలు చేసిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. ఈ అమ్మడు టాలీవుడ్ తో పాటు బాలీవుడ్ లో కూడా స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకున్న విషయం తెల్సిందే. ఒకానొక సమయంలో వరుస సినిమాలతో ఎన్నో క్రేజీ ప్రాజెక్ట్ లకు కూడా నో చెప్పింది. మహేష్ బాబు వంటి స్టార్ హీరో సినిమాకు డేట్లు కుదరక పోవడంతో నో చెప్పిన రకుల్ ప్రీత్ సింగ్ తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో ఆఫర్లు తగ్గడంతో కనిపించకుండా పోయింది. టాలీవుడ్ లో ఆఫర్లు తగ్గడంతో బాలీవుడ్ వైపు వెళ్లింది. అక్కడ రెండేళ్ల పాటు సందడి చేసింది. ఇప్పుడు హిందీ సినిమా పరిశ్రమలో కూడా రకుల్ కు పెద్దగా ఆఫర్లు లేవు. అయినా కూడా తన అందంతో మళ్లీ బిజీ అవుతాను అనే నమ్మకంతో రకుల్ ప్రీత్ సింగ్ కనిపిస్తోంది. సినిమాల ద్వారా వార్తల్లో నిలువకున్నా కూడా సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్ గా వార్తల్లో ఉంటూనే ఉంది. తన అందమైన ఫోటోలను షేర్ చేసే రకుల్ ప్రీత్ సింగ్ ఈసారి యోగాసనాలు వేసిన ఫోటోలను షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అందమైన రకుల్ ప్రీత్ సింగ్ చాలా కష్టతరమైన యోగ ఆసనాలు వేయడం ద్వారా చాలా మందికి ఆదర్శంగా నిలుస్తుందని కొందరు అంటున్నారు. చూడ్డానికి చాలా సుకుమారంగా, సున్నితంగా కనిపించే ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ భలేగా యోగాసనాలు వేసిందే అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఫిజిక్ కోసం ఇంత కష్టపడుతున్న రకుల్ కి మళ్లీ సినిమాల్లో ఆఫర్లు వస్తే బాగుండు అన్నట్లుగా ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరి అది వర్కౌట్ అయ్యేనా చూడాలి.

## ప్రభాస్ 'కల్కి' బ్యూటీ హాలీవుడ్‌కి షిఫ్ట్

బాలీవుడ్ నుంచి చాలా మంది కథానాయికలు హాలీవుడ్ లో నటించారు. అందులో ఐశ్వర్యారాయ్, నర్గీస్ ఫక్రీ, ప్రియాంక చోప్రా, దీపిక పదుకొనే పేర్లు ప్రముఖంగా ఉన్నాయి. ప్రియాంక చోప్రా ఇటీవల వరుసగా హాలీవుడ్ ప్రాజెక్టులకే ప్రాముఖ్యతనిస్తుండగా, ఇతర నాయికలు అరుదుగా మాత్రమే హాలీవుడ్ లో నటిస్తున్నారు. ఇప్పుడు ప్రభాస్ సరసన 'కల్కి' చిత్రంలో నటిస్తున్న దీపిక పదుకొనే తన తదుపరి హాలీవుడ్ చిత్రంపై దృష్టి సారించారని తెలుస్తోంది. దీపికా పదుకొనే తన మొదటి హాలీవుడ్ ప్రాజెక్ట్ '%శశశ%: రిటర్న్ ఆఫ్ క్జాండర్ కేజ్'(2017)లో నటించింది. ఇప్పుడు మరో భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ లో నటించడానికి సిద్ధంగా ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. జూమ్ నివేదిక ప్రకారం.. ది వైట్ లోటస్ వెబ్ సిరీస్ మూడవ సీజన్ లో దీపిక నటించనుంది. అమెరికన్ కామెడీ-డ్రామా షో మూడవ సీజన్ ను ప్రస్తుతం థాయిలాండ్‌లో



చిత్రీకరిస్తున్నారు. అయితే ఈ వార్తలను దీపిక ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. దీపిక ప్రస్తుతం 'ఫైటర్' విడుదల ప్రమోషన్స్ లో బిజీగా ఉంది. ఈ చిత్రం టీజర్, ట్రైలర్ దశ నుంచే మాస్‌లో ఫీవర్ పుట్టించగా అడ్వాన్స్ బుకింగుల్లోను దూసుకెళుతోంది. ఈ చిత్రం పవర్-ప్యాక్డ్ యాక్షన్ సీక్వెన్స్ లతో రూపొందింది. ఇప్పటి వరకు 3%ణ, 3ణ ×హీూశ% ఫార్మాట్‌లలో అత్యుత్తమ అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్ ని ఈ సినిమా కోసం ఉపయోగించామని టీమ్ చెబుతోంది. హృతిక్ రోషన్ - దీపికా పదుకొణెల సిజ్లింగ్ కెమిస్ట్రీ ఈ చిత్రానికి అదనపు ఆకర్షణ కానుంది. ఆడ్రినలిన్-పంపింగ్ యాక్షన్-ప్యాక్డ్ రైడ్ కోసం ప్రేక్షకులు తమ టిక్కెట్‌లను ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ ఫైటర్ అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభించింది. సినిమాపై జనాల్లో ఉన్న పిచ్చి చూస్తుంటే ఓపెనింగుల పరంగా రికార్డులు క్రియేట్ చేస్తుందని విశ్లేషిస్తున్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పెద్ద తెరపైకి రాబోతున్న ఈ చిత్రం 2024కి సరైన ప్రారంభం కానుందని అంచనా వేస్తున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మార్ఫ్లిక్స్ పిక్చర్స్ - వయాకామ్ 18 స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. ఫైటర్ 25 జనవరి 2024న థియేటర్లలోకి రానుంది.

## స్కైలోకి దీపిక రియల్ పెట్టుబడులు

బాలీవుడ్ అగ్ర కథానాయికలు ఇటీవల స్టార్ హీరోలతో పోటీపడుతూ ఆర్జిస్తున్న సంగతి తెలిసిందే. దీపిక పదుకొనే లాంటి కథానాయిక ఒక్కో ప్రాజెక్టుకు రూ.15-20 కోట్ల మేర అందుకుంటోంది. ఇవేగాక వాణిజ్య ప్రకటనలతో ఆదాయం, సోషల్ మీడియాలతో రెవెన్యూ ఇవన్నీ అదనం. ఇక డబ్బును పెట్టుబడులు పెట్టడానికి బాలీవుడ్ టాప్ హీరోయిన్ దీపిక పదుకొనే రియల్ ఎస్టేట్ ని ఎక్కువగా ఆశ్రయించిందని సమాచారం. 2013లో లైఫ్‌స్టైల్ ఆసియా వెలువరించిన ఓ కథనం ప్రకారం ప్రభాదేవి విల్లాస్‌లో రూ.16 కోట్ల విలువైన విలాసవంతమైన ఇంటిని కొనుగోలు చేయడం ద్వారా రియల్ ఎస్టేట్ లో పెట్టుబడి పెట్టింది. ఆ తర్వాతా దీపిక ముంబైలో పలు అపార్ట్ మెంట్లను కొనుగోలు చేసి లాభాలకు అమ్మేసింది. ఇక భర్తతో కలిసి పలు రియల్ వెంచర్లలో దీపిక పెట్టుబడులు పెట్టింది. దీపిక భర్త రణవీర్ బాంద్రాలో రూ.119 కోట్ల విలువైన నివాసాన్ని కలిగి ఉన్నారు. ఈ ప్రత్యేక ఆస్తి విస్తారమైన 11,266 చదరపు అడుగుల క్వాడ్రప్లెక్స్.. వ్యూహాత్మకంగా షారూఖ్ ఖాన్ ఐకానిక్ హోమ్ మన్నత్‌కు ఇది ఆనుకుని ఉంది. ఈ దంపతుల ప్రాథమిక నివాసం.. వోర్లీలోని విలాసవంతమైన 5-BHK అపార్ట్‌మెంట్..దీని ధర రూ.40 కోట్లు ఉంటుందని సమాచారం. సిటీలోని రియల్ వెంచర్లతో పాటు.. దీపిక-రణవీర్ గ్రామీణ ప్రాంతాల్లోను భూములపై భారీగా పెట్టుబడులు పెట్టారు. మార్కెటింగ్ రంగంలో దీపిక పాపులర్ ఫేస్. హ్యుందాయ్, తనిష్క్, ఏషియన్ పెయింట్స్, లెవీస్, నెస్కేఫ్, అడిడాస్, ఒప్పో, విస్తారా,



యాక్సిస్ బ్యాంక్ సహా అనేక ఇతర పాపులర్ పేర్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంది. దీనికి తోడు లూయిస్ విట్టన్, క్యారియర్, పోటరీ బార్న్, డైసన్ వంటి హై ఎండ్ బ్రాండ్‌లకు ప్రచారకర్తగా ప్రాతినిధ్యం వహిస్తుంది. మనీకంట్రోల్ వివరాల ప్రకారం, బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ల కోసం దీపికకు కంపెనీలు సుమారుగా రూ. 8 కోట్ల రుసుమును చెల్లించాల్సి ఉంటుంది.

**సోషల్ మీడియా పోస్టులు :** టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం, ఇన్‌స్టాగ్రామ్‌లో 78 మిలియన్ల మంది అనుచరులను కలిగి ఉన్న దీపిక ప్రమోషనల్ పోస్ట్‌లకు గణనీయమైన రుసుమును వసూలు చేస్తోంది. ఒక్కో పోస్ట్‌కు రూ. 1 కోటి నుండి రూ. 2 కోట్ల మధ్య అందుకుంటోందని అంచనా.

**స్టార్టప్ పెట్టుబడులు :** సినిమాలు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ల నుండి దీపిక ప్రాథమిక ఆదాయ మార్గాలతో పాటు, వివిధ స్టార్టప్‌లలో వ్యూహాత్మక పెట్టుబడుల ద్వారా తన ఆదాయాన్ని పెంచుకుంది. బ్లూ టోకాయ్, బ్లూస్మార్ట్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, ఫ్యూర్లెంకో, పర్పుల్, ఎపిగామియా, మోకోబారా దీపిక పోర్ట్‌ఫోలియోలోని ముఖ్యమైన వెంచర్లు.

**ప్రొడక్షన్ హౌస్ :** 2020లో యాసిడ్ ఎటాక్ కి గురైన యువతి జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన ఛపాక్‌కి నిర్మాతగా వ్యవహరించి, చిత్ర నిర్మాణ రంగంలోకి ప్రవేశించింది. ఈ ప్రయత్నం తర్వాత కబీర్ ఖాన్ స్పోర్ట్స్ డ్రామా, 83లోను పెట్టుబడులు పెట్టింది. తన బ్యానర్ KA ప్రొడక్షన్స్ తో సినీనిర్మాతగా తన ప్రస్థానాన్ని కొనసాగించింది. ముఖ్యంగా 83లో, దీపికా నిర్మాత పాత్రను పోషించడమే కాకుండా రోమీ దేవ్ పాత్రను కూడా పోషించింది. రోడీ భారత మాజీ క్రికెటర్ కపిల్ దేవ్ భార్య.



# ఇకపై 'బాలక్ రామ్'గా దర్శనం

అయోధ్య: శతాబ్దాల స్వప్నం సాకారమై అయోధ్యలోని నవ నిర్మిత భవ్య మందిరంలో రామయ్య కొలువుదీరాడు. ప్రధాని చేతులమీదుగా గర్భగుడిలో శాస్త్రోక్తంగా జరిగిన ప్రాణ ప్రతిష్ఠ వేడుక చూసి భక్తజనం పులకించిపోయింది. అయితే, ఈ ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన రామ్‌లల్లాను ఇకపై 'బాలక్ రామ్'గా పిలవనున్నారు. ఈ మేరకు ట్రస్ట్ పూజారి అరుణ్ దీక్షిత్ వెల్లడించారు. "జనవరి 22న ప్రతిష్ఠించిన శ్రీరాముడి విగ్రహానికి 'బాలక్ రామ్'గా పేరు పెట్టాం. అయోధ్యలో కొలువుదీరిన రామచంద్రమూర్తి ఐదేళ్ల పసిబాలుడిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. అందుకే ఈ పేరును నిర్ణయించాం. ఇకపై ఈ ఆలయాన్ని బాలక్ రామ్ మందిరంగా పిలుస్తాం" అని ఆయన పేర్కొన్నారు.

**రోజుకు ఆరుసార్లు హారతి..** మంగళవారం నుంచి బాలరాముడి దర్శనానికి సామాన్య భక్తులను అనుమతించారు. ఇక, ప్రాణప్రతిష్ఠ పూర్తవడంతో హారతి వేళలు, పూజా కార్యక్రమాల్లో కొన్ని మార్పులు చేసినట్లు తెలిసింది. రోజుకు ఆరుసార్లు హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రస్ట్‌కు చెందిన ఆచార్య మిథిలేశ్‌నందిని శరణ్ తెలిపారు. ప్రతిరోజూ మంగళ (నిద్ర లేపేందుకు), శ్రింగార (అలంకరణ సేవలో), భోగ (నైవేద్య సమర్పణ వేళ), ఉతపన్ (దిష్టి తగలకుండా), సంధ్యా (సాయంత్రం వేళ), శయన హారతి (స్వామి వారిని నిద్ర పుచ్చేందుకు) ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

**నైవేద్యం ఇలా..** పూరి, కూరతో పాటు రబ్‌డీ-ఖీర్, పాలు, పండ్లు, పాలతో చేసిన స్వీట్లను నైవేద్యంగా సమర్పించనున్నారు. సోమవారం తెలుపు, మంగళవారం ఎరుపు, బుధవారం ఆకుపచ్చ, గురువారం పసుపు, శుక్రవారం గోధుమ, శనివారం నీలం, ఆదివారం గులాబీ రంగు వస్త్రాల్లో 'బాలక్ రామ్' దర్శనం ఇవ్వనున్నారు.



# వచ్చే నెల నుంచే ఉచిత విద్యుత్ హామీ అమలు చేస్తాం..!

హైదరాబాద్: కేసీఆర్ సర్కార్ నిర్వాకం వల్ల తెలంగాణ అప్పులపాలైందన్నారు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. అందువల్లే ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతోందన్నారు. ఫిబ్రవరి నెల నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు హామీ అమలు చేస్తామని చెప్పారు. నిరుద్యోగ భృతి మొదలుకొని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వరకు అన్ని హామీలను గత ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదన్న మంత్రి.. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు అన్ని అక్రమాలపై విచారణ కొనసాగుతుందని తెలిపారు.

**కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ భేటీ :** గాంధీభవన్‌లో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సమావేశమైంది. మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జ్ దీపదాస్ మున్షి, ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు పాల్గొన్నారు. మ్యానిఫెస్టోలో తెలంగాణ నుంచి చేర్చాల్సిన అంశాలపై చర్చించారు. అన్ని రాష్ట్రాల్లో తిరిగి అభిప్రాయాలను సేకరిస్తున్న కేంద్ర మేనిఫెస్టో కమిటీ.. తెలంగాణ మేనిఫెస్టో కమిటీ నుంచి కూడా అభిప్రాయాలను సేకరించింది. నాలుగైదు కామన్ స్కీములతో పాటు.. రాష్ట్రాల కోసం ప్రత్యేక అంశాలను మేనిఫెస్టోలో పెట్టాలని కాంగ్రెస్ నిర్ణయం నిర్ణయించింది.

**ప్రతిపక్షాలవి తొందరపాటు విమర్శలు :** మేనిఫెస్టోతోనే తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలించిందని అన్నారు పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఎంతో విశ్వసాన్ని చూపారని అన్నారు. ప్రతిపక్ష పార్టీ చేస్తున్న విమర్శలు చాలా తొందరపాటుగా ఉన్నాయని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**ఏఐసీసీ మ్యానిఫెస్టోకు టీ కాంగ్రెస్ సాయం తీసుకుంటాం :** మేనిఫెస్టో అంటే ప్రజలకు దగ్గరగా, అమలుకు నోచుకునే విదంగా ఉండాలని ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. తెలంగాణలో మంచి మేనిఫెస్టో అందించారని.. అందుకే రాష్ట్ర ప్రజలు విశ్వసించారని పేర్కొన్నారు. ఏఐసీసీ మేనిఫెస్టో కేంద్ర మాజీ మంత్రి చిదంబరం నేతృత్వంలో రూపొందుతుందని చెప్పారు.

మ్యానిఫెస్టో పబ్లిక్ ఫ్రెండ్లీగా, క్రోని కాపిటల్‌కు దూరంగా ప్రజావసరాలకు దగ్గరకు ఉండాలన్నారు. ఏఐసీసీ మ్యానిఫెస్టోకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సహకారం తీసుకుంటామన్నారు.

# మంత్రి పొంగులేటితో ధరణి కమిటీ భేటీ



హైదరాబాద్, జనవరి 23: రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ధరణి కమిటీ మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యింది. ధరణి సమస్యలపై తక్షణ పరిష్కారాల కోసం ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక ఇస్తామని నిన్న (సోమవారం) ధరణి కమిటీ చెప్పిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మధ్యంతర నివేదికపై రెవెన్యూ శాఖ మంత్రితో కమిటీ సభ్యులు చర్చలు నిర్వహించారు. రేపు(బుధవారం) సిద్దిపేట, మెదక్ జిల్లాలతో పాటు మరో రెండు జిల్లాలు... మొత్తం నాలుగు జిల్లాల కలెక్టర్లతో సీసీఎల్ఏలో ధరణి కమిటీ సమావేశం కానుంది. క్షేత్రస్థాయి భూ సమస్యలపై కమిటీ ఆరా తీయనుంది. భేటీ అనంతరం రెవెన్యూ శాఖ మంత్రికి పూర్తి స్థాయి మధ్యంతర నివేదికను కమిటీ సభ్యులు ఇవ్వనున్నారు. త్వరలోనే కమిటీ మధ్యంతర నివేదికపై సీఎం రేవంత్ రెడ్డితో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చర్చించరు.

# మోదీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..?



హైదరాబాద్: శ్రీరాముడిని పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రధాని మోదీ ఆయుధంగా వాడుకుంటున్నారని మాజీ ఎంపీ వి. హనుమంతరావుఆరోపించారు. మంగళవారం నాడు గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... మోదీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? అని నిలదీశారు. మోదీ రాముడా..? రాహుల్ గాంధీ రావణుడా..? ఇది ఏం న్యాయం..? మణిపూర్‌లో వందల మంది మహిళలు చనిపోతే మోదీ వెళ్లారా..? తెలంగాణలో ఉన్న భద్రాద్రి ఆలయానికి ఎందుకు ఆహ్వానం పంపించలేదని ప్రశ్నించారు.

రాముడు అందరివాడని.. ఓట్ల కోసమే మోదీ రాజకీయం చేస్తున్నారని వి. హనుమంతరావు మండిపడ్డారు.

# మంచి మేనిఫెస్టో ఇవ్వగలిగాం.. హామీలన్నీ అమలు చేస్తాం..



హైదరాబాద్, జనవరి 23: ఎన్నికల ముందు ఒక మంచి మేనిఫెస్టో అందించగలిగామని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మంత్రి అధ్యక్షతన టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో అన్నింటికంటే మంచి మేనిఫెస్టో ఇవ్వగలిగామన్నారు. మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీలు ఇచ్చామని.. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేసే దిశగా అడుగులు వేశామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక రెండో రోజు మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, ఆరోగ్యశ్రీలో పది లక్షల ఆరోగ్య పథకాన్ని అందించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఎంతో విశ్వాసాన్ని చూపారన్నారు. ప్రతిపక్ష పార్టీ చేస్తున్న విమర్శలు చాలా తొందరపాటుగా ఉన్నాయని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.



# స్టడీ పర్మిట్లపై కెనడా పరిమితి

ఒట్టావా: కెనడాకు వచ్చే విదేశీ విద్యార్థులకు కొత్తగా ఇవ్వబోయే స్టడీ పర్మిట్లపై రెండేళ్ల పాటు పరిమితి విధించనున్నట్లు ఆ దేశ ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ సోమవారం ప్రకటించారు. ఇప్పుడు ఇస్తున్న వాటిలో మూడో వంతు పర్మిట్లపై కోత పెట్టనున్నట్లు తెలిపారు. దేశీయంగా పెరుగుతున్న ఇళ్ల కొరత, నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దశాబ్దం క్రితంతో పోలిస్తే దేశంలో విదేశీ విద్యార్థుల సంఖ్య మూడింతలు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పరిమితి అమల్లోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది 3.64 లక్షల మంది విద్యార్థులకు పర్మిట్లు లభించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. 2023తో పోలిస్తే ఇది 35 శాతం తక్కువ. 2025కు సంబంధించిన అంచనాలను ఈ ఏడాది చివర్లో వెల్లడిస్తామని మిల్లర్ తెలిపారు. విదేశీ విద్యార్థుల అనుమతి విధానాన్ని మరింత మెరుగుపర్చి వారికి ఉన్నతమైన విద్యను అందించడమే పరిమితి వెనుక ప్రధాన ఉద్దేశమని వివరించారు. అలాగే తగినన్ని నివాసాలను అందుబాటులో ఉంచడం కూడా ఓ కారణమన్నారు. ఇక్కడికి వచ్చే వారందరికీ సరైన వనరులు అందివ్వకపోవడం సమంజసం కాదని తాము భావిస్తున్నామన్నారు. నిరాశతో వారు సొంత దేశానికి తిరిగి వెళ్లడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు.

**మాస్టర్స్, డాక్టోరల్ విద్యార్థులకు వర్తించదు..** ఇప్పటికే ఇచ్చిన పర్మిట్లపై ఎలాంటి ప్రభావం ఉండదని మిల్లర్ స్పష్టం చేశారు. మాస్టర్స్, డాక్టోరల్ విద్యార్థులకు తాజా పరిమితులు వర్తించవని తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం.. ప్రావిన్స్‌ల వారీగా పర్మిట్లను కేటాయిస్తారు. అక్కడి సంస్థలు, వనరుల ఆధారంగా స్థానిక ప్రభుత్వాలు వాటిని పంపిణీ చేయాలి. ఆయా సంస్థల అనుమతి కోరుతూ వచ్చిన పర్మిట్ల దరఖాస్తులపై ప్రావిన్స్ లేదా టెరిటరీలు ఆమోద లేఖ జారీ చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు తగిన మార్పులు చేసుకునేందుకు కెనడా ప్రభుత్వం మార్చి 31 వరకు ప్రావిన్స్‌లకు గడువిచ్చింది.

**వర్క్ పర్మిట్లలోనూ మార్పులు..** 'పోస్ట్ గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్లకు' సంబంధించిన అర్హతల్లోనూ కెనడా ప్రభుత్వం మార్పులు చేసింది. 2024 సెప్టెంబర్ నుంచి 'కరికులం లైసెన్సింగ్ అరేంజ్‌మెంట్స్' కింద నమోదు చేసుకున్న విద్యార్థులకు వర్క్ పర్మిట్ ఇవ్వబోమని తెలిపింది. మరోవైపు మాస్టర్స్ ప్రోగ్రామ్ కింద నమోదైన గ్రాడ్యుయేట్లు మూడేళ్ల వర్క్ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించడం గమనార్హం. కెనడాలో విద్యనభ్యసించడానికి వెళ్లే విదేశీ విద్యార్థుల్లో భారతీయులే అత్యధికం.

2022లో 2,25,835 స్టడీ పర్మిట్లు జారీ చేయగా.. అందులో 41 శాతం భారతీయ విద్యార్థులే సొంతం చేసుకున్నారు. అక్కడి విశ్వవిద్యాలయాలకు విదేశీ విద్యార్థులే ప్రధాన ఆదాయ వనరు.

# నేను పార్టీ మారాల్సిన అవసరం లేదు... చాలా కంఫర్ట్‌గా ఉన్నాను



హైదరాబాద్: తాను బీఆర్ఎస్ పార్టీ మారాల్సిన అవసరం లేదని.. చాలా కంఫర్ట్‌గా ఉన్నానని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులను చూసే ప్రజలు ఓట్లేస్తారని చెప్పారు. అధిష్టానం ఆదేశిస్తే తన కుమారుడు అమిత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తారని అన్నారు. బీఆర్ఎస్ ఇప్పుడు అధికారంలో లేదని.. ఈ కష్టకాలంలో పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూడు నాలుగు రోజుల్లో టికెట్‌పై ఓ క్లారిటీ వస్తుందన్నారు. మంగళవారం నాడు పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కొంత మందికి పార్టీపై అసంతృప్తి ఉండవచ్చని చెప్పారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అభివృద్ధి చేసిన మంత్రులు కూడా భారీ తేడాతో ఓడిపోయారని తెలిపారు. ఓటమికి వ్యక్తులు కారణం కారన్నారు. భువనగిరి, నల్గొండ ఎక్కడ టికెట్ ఇచ్చినా అమిత్ రెడ్డి పోటీ చేస్తారని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.

**అయోధ్య వల్ల బీజేపీకి ఓట్లు పెరగవచ్చు :** హైకమాండ్ ఎవరికి టికెట్ ఇచ్చినా వారి గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. ఇందిరా గాంధీ మీద జైపాల్ రెడ్డి పోటీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నల్గొండలో సోనియా గాంధీ పోటీ చేస్తే అమిత్ రెడ్డి తనపై పోటీ చేస్తారని తేల్చిచెప్పారు.

అయోధ్య అంశం తర్వాత బీజేపీకి కొన్ని ప్రాంతాల్లో ఓట్లు 2 నుంచి 3 శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. కేఆర్ఎంబీ పరిధిలోకి శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు పోవడంతో తెలంగాణ ప్రయోజనాలకు భారీ నష్టం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేఆర్ఎంబీ పరిధిలోకి ప్రాజెక్టులు పోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# అహంకారం వల్లే భారాస నేతలు ప్రజలకు దూరం: రఘునందన్‌రావు



హైదరాబాద్: తెలంగాణ అమరవీరులకు భారాస నేతలు కేటీఆర్, హరీశ్‌రావులు క్షమాపణలు చెప్పాలని భాజపా నేత, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. కష్టపడేవారికి భారాసలో ఏనాడూ గుర్తింపులేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి సీట్లు ఇస్తామని కేటీఆర్, హరీశ్‌రావు అమరవీరుల స్తూపం వద్ద ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ పేరును ప్రచారానికి ఉపయోగించుకుని ఉద్యమకారులకు అన్యాయం చేశారని ఆరోపించారు. "రాష్ట్రం ఏర్పడిన తర్వాత కీలక పదవుల్లో ఉంటూ రూ. వందల కోట్లు సంపాదించిన అధికారులకు రాజకీయ పదవులు కట్టబెట్టారు. సీట్లు అమ్ముకోవడం.. డబ్బు దండుకోవడమనే ఆలోచనతో భారాస పనిచేస్తోంది. కాంగ్రెస్, భాజపా సిద్ధాంతపరంగా విభిన్నమైన పార్టీలు. రెండు ఒకటేనని భారాస దుష్ప్రచారం చేస్తోంది. ఇతర పార్టీలతో మా పొత్తులు పెట్టుకోదు. అహంకారం వల్లే భారాస నేతలు ప్రజలకు దూరమయ్యారు" అని రఘునందన్‌రావు అన్నారు.

# తెలంగాణ నుంచి కాంగ్రెస్ కార్యకర్తల రాష్ట్రస్థాయి సమావేశాలు మొదలు..!



హైదరాబాద్ : 2024 సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు మొదలుపెట్టింది. దీనిలో భాగంగా జనవరి 25వ తేదీ నుంచి రాష్ట్రస్థాయిలో కార్యకర్తల సమావేశాలు ప్రారంభించనుంది. సంస్థాగతంగా కార్యకర్తలను ఉత్తేజపర్చేందుకు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వయంగా ఆఫీస్ బేరర్ల మీటింగ్‌ల్లో పాల్గొననున్నారు. వీటిలో భాగంగా తొలి సమావేశం తెలంగాణలో జరగనుంది. ఇటీవలే ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జనవరి 28వ తేదీన ఉత్తరాఖండ్, 29న ఒడిస్సా, ఫిబ్రవరి 3న దిల్లీ, 4న కేరళ, 10న హిమాచల్ ప్రదేశ్, 11న పంజాబ్, 13న తమిళనాడు, 15న ఝూరండ్ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. బూత్ నుంచి రాష్ట్ర స్థాయి వరకు కేడర్‌తో ఖర్గే సమావేశమవుతారని తెలిపారు. వచ్చే ఎన్నికలకు వారిని సమాయత్తం చేస్తారన్నారు. ఇటీవల జనవరి 4వ తేదీన జరిగిన ఓ సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ రేయింబవళ్లూ శ్రమించి 2024లో ప్రజలకు ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఇవ్వాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. విభేదాలను పక్కన పెట్టాలని, మీడియాలో పార్టీ అంతర్గత విషయాలను ప్రస్తావించవద్దని ఆయన శ్రేణులకు సూచించారు. మరోవైపు రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ఈశాన్య రాష్ట్రాల్లో జరుగుతోంది. తాజాగా ఇది అస్సాంకు చేరుకొంది. నిన్న ప్రముఖ వైష్ణవ సాధువు శ్రీమంత్ శంకర్‌దేవ జన్మస్థలి బతద్రవ సత్రను దర్శించుకోకుండా తనని అడ్డుకొన్నారని రాహుల్ ఆరోపించారు. నేడు గువాహటి వద్ద యాత్రలో ఉద్రిక్తత తలెత్తింది. పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో రాహుల్ బృందంపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# జగదీష్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయం: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: కాంగ్రెస్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలుచేశారు. భూ దోపిడీదారుడు జగదీష్ రెడ్డికి తనను విమర్శించే స్థాయి లేదని అన్నారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో అక్రమాలతో పాటు ఛత్తీస్‌గఢ్‌లో కరెంటు కొనుగోళ్లలో అవినీతి బయటపడుతుందన్న అక్కసుతోనే తనపై మాజీ మంత్రి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.. జగదీష్ రెడ్డి అవినీతిపై విచారణ జరిపిస్తామని తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ అవడం ఖాయమని మంత్రి కోమటిరెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ మూడు ముక్కలవుతుందని జోస్యం చెప్పారు. కేసీఆర్ కుటుంబం తర్వాత జైలుకు పోయేవ్యక్తి జగదీష్‌రెడ్డేనని అన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ తర్వాత జగదీష్ రెడ్డి జైలుకు పోవడం ఖామమని తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com